
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY అన్నమయ్య జిల్లా వార్తలు
5
గురువారం 22 ఆగస్టు 2024


ప్రాజెక్టు తెగిపోయినప్పుడు మండపల్లెలో ప్రవహిస్తున్న వరద నీరు (ఫైల్)


నాటి వరదకు సజీవ సాక్ష్యంగా మిగిలిన పులపత్తూరులో ఇళ్ల శిథిలాలు


పులపత్తూరులో ఇళ్లు కొట్టుకుపోవడంతో ఇళ్ల కింద మిగిలిన బండరాళ్లు

# మూడేళ్లవుతున్నా..

- అప్పుడెలా ఉందో.. ఇప్పుడూ అలాగే..
- అన్నమయ్య వరద ప్రభావిత ప్రాంతాల్లో కనిపించని కనీస సౌకర్యాలు
- కూటమి ప్రభుత్వంపై కోటి ఆశలు
- ఉపాధి అవకాశాలు కల్పించాలని బాధితుల విజ్ఞప్తి
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటన సందర్భంగా..
- అన్నమయ్య బాధితుల్లో చిగురిస్తున్న ఆశలు

రాజంపేట, ఆగస్టు 21: అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయి వేలాదిమంది నిరాశ్రయులై వచ్చే నవంబరు 19 నాటికి మూడేళ్లవుతుంది. ఇప్పటివరకు వారి బాధలు మాత్రం తీరలేదు. ప్రాజెక్టు తెగిపోయి నాటి పాలకుల నిర్లక్ష్యానికి నిలువుటద్దంగా నిలుస్తూ బోసిపోయిన గేట్లు వెక్కిరిస్తున్నాయి. 2021 సంవత్సరం నవంబరు 19వ తేదీ తెల్లవారుజామున అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. ఈ సంఘటనతో పులపత్తూరు, తొగూరుపేట, మందపల్లె, గుండ్లూరు, తాళ్లపాక, రామచంద్రాపురం గ్రామాలు పూర్తిగా నీటమునిగాయి. ప్రధానంగా పులపత్తూరు, తొగూరుపేట, మందపల్లె, రామచంద్రాపురం పూర్తిగా వరద పాలయ్యాయి. 40 మంది పైబడి మృత్యువాతపడ్డారు. 450 ఇళ్లు కొట్టుకుపోయాయి. రాజంపేట, నందలూరు, పెనగలూరు చెయ్యేరునది పరీవాహక ప్రాంతాలైన అన్నమయ్య ప్రాజెక్టు దిగువన ఉన్న వందలాది గ్రామాలు పూర్తిగా నీటిపాలయ్యాయి. వేలాది ఎకరాల భూమి వ్యవసాయానికి పనికిరాకుండా ఇసుకమేటలు వేసింది. వేలాది పశువులు అశువులు బాశాయి.

అప్పటి ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లాలో సంఘటన జరిగినా ఆయన మొక్కుబడిగా వచ్చి వెళ్లారే తప్ప ఆయన ఇచ్చిన హామీలు నేటికీ ఏ ఒక్కటీ నెరవేరలేదు. ప్రధానంగా ఈ ప్రాజెక్టు తెగిపోయిన తర్వాత ముఖ్యమంత్రి హోదాలో జగన్ అక్కడికి వచ్చి అన్నమయ్య ప్రాజెక్టు బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని, వారికి పక్కాఇళ్లు వెంటనే కట్టించి ఇస్తామని, ఇసుకమేటలు తొలగించి వ్యవసాయ భూములను బాగు చేసి రైతులకు అప్పగిస్తామని, వారికి పంట రుణాలు అందజేస్తామని, పునరావాస గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్లను, మంచినీటి సౌకర్యాన్ని, విద్యుత్ సౌకర్యాన్ని ఇతర మౌలిక సదుపాయాలు సత్వరం ఏర్పాటు చేస్తామని, ఈ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని... ఇలా ఎన్నెన్నో హామీలు గుప్పించినా ఏ ఒక్కటీ ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు.

అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిన మూడేళ్లకు ప్రభుత్వం మారింది. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెగిపోయిన అన్నమయ్య ప్రాజెక్టును పరిశీలించడంతో పాటు ముంపుబాధిత గ్రామాల్లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ మూడేళ్లుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులను డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కలెక్టర్ చామకూర్తి శ్రీధర్ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగమంతా ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తోంది. అన్నమయ్య ప్రాజెక్టు ఉన్నతాధికారులు కూడా ఇక్కడే మకాం వేశారు. ప్రధానంగా మూడేళ్లుగా ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఎటువంటి ఆదరణ లేక అనాథలుగా మారిన ఈ ప్రాంత ప్రజలు నేడు గంపెడాశతో నూతన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరిస్తుందని ఎదురుచూస్తున్నారు. ఈ సందర్భంగా ఇక్కడ నెలకొన్న సమస్యలను మరోసారి వారు ప్రభుత్వం దృష్టికి తెస్తున్నారు.

### ఇళ్ల నిర్మాణాలకు నిధులు విడుదల చేయాలి

ప్రధానంగా ప్రాజెక్టు తెగిపోయినప్పుడు పులపత్తూరులో ఎక్కువ ఇళ్లు కొట్టుకుపోయాయి. ఆ తర్వాత తొగూరుపేట, మందపల్లె, రామచంద్రాపురం గ్రామాల్లో ఇళ్లు దెబ్బతిన్నాయి. వీరికి మూడు నెలల్లో ఇళ్లు కట్టిస్తామన్న జగన్ ప్రభుత్వం రెండేళ్ల తర్వాత ప్రత్యేక ప్యాకేజీ కింద ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు కేటాయిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆ ఇళ్లు నేటికీ పూర్తి కాలేదు. నిధులలేమి కారణంగా ఎక్కడ ఇళ్లు అక్కడే నిలిచిపోయాయి. మిగిలినచోట్ల స్వయంగా కాంట్రాక్టర్ పనులు చేస్తున్నా ప్రభుత్వం నుంచి డబ్బులు రాకపోవడంతో కాంట్రాక్టర్ కూడా ఏమీ చేయలేక ఇళ్లు కట్టించలేని పరిస్థితుల్లో ఉన్నారు. వారికి ఇంటి నిర్మాణాలకు బకాయి సొమ్ములు వెంటనే విడుదల చేయాల్సి ఉంది.

### ఇసుక మేటలు తొలగించాలి

చెయ్యేరునది పరీవాహక ప్రాంతాలైన అన్నమయ్య ప్రాజెక్టు దిగువ ప్రాంతం ఏడాదికి మూడు పంటలు పండుతూ పచ్చని పంటలతో అలరారుతూ కోనసీమగా పిలువబడేది. వరి, వేరుశనగ, మామిడి, పసుపు లాంటి అనేక పంటలు పండేవి. ప్రాజెక్టు తెగిపోవడంతో ఈ భూములపై ఇసుకమేటలు చేరి వ్యవసాయ యోగ్యంగా లేక ఎడారిగా మారిపోయాయి. అనేకమంది రైతులు వారికి వారే అనేకచోట్ల ఇసుక మేటలు తొలగించుకుని పంటలు పండించుకుంటున్నా ప్రభుత్వం మాత్రం ఏ మాత్రం స్పందించడం లేదు. ఇప్పటికైనా ఇసుకమేటలను పంట పొలాల్లో తొలగించి ఆ భూములను సాగు యోగ్యంగా మార్చాల్సి ఉంది.

- వరదలో 40 మందికి పైబడి చనిపోయారు. ఈ కుటుంబాల్లో 11 మందికి పైబడి చిరుద్యోగాలు కల్పించారు. మిగిలిన కుటుంబాలకు ఉద్యోగం కల్పించి వారి ద్వారా చనిపోయిన కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాల్సిన అవసరం ఉంది.
- ఇక్కడ పూర్తిగా మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. ప్రాజెక్టు తెగిపోయినప్పుడు ఈ ప్రాంతాల్లో నాటి ముఖ్యమంత్రి జగన్ పర్యటన సందర్భంగా తాత్కాలికంగా కంకర రోడ్లు వేశారు. ఇంతవరకు ఏ గ్రామానికి రోడ్ల సౌకర్యం కల్పించలేదు. అరకొర విద్యుత్ సౌకర్యం కల్పించినా పూర్తిస్థాయిలో ఇళ్లకు, వ్యవసాయ పంపుసెట్లకు కరెంటు సౌకర్యాన్ని ఏర్పాటు చేయలేదు. ప్రత్యేక ప్యాకేజీ కింద ఈ ప్రాంతానికి కరెంటు సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలి. ఇతర మౌలిక సదుపాయాలను పూర్తి చేయాలి. మందపల్లె లాంటి ప్రధాన గ్రామంలో అర్ధంతరంగా గ్రామ సచివాలయం భవన నిర్మాణాన్ని ఆపివేసినా తిరిగి ఏర్పాటు చేయలేదు.
- ఈ ప్రాంతంలో వేలాదిగా పశుసంపద ఉండేది. ఈ పశువులంతా పూర్తిగా నీటిపాలయ్యాయి. సుమారు 3వేల పశువులు నీటిలో కొట్టుకుపోయాయి. తిరిగి పాడి రైతులకు పశుసంపద ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకుల ద్వారా ప్రత్యేక రుణాలు ఇప్పించాలి. ఈ ప్రాంత అభివృద్ధికి పశుసంపదను పెంచాలి.
- భారీ వరద వల్ల మందపల్లె, తొగూరుపేట, రామచంద్రాపురం, గుండ్లూరు ప్రాంతాల్లో నది పుట్టినప్పటి నుంచి తరతరాలుగా ఉండే జగతి కట్టలన్నీ కొట్టుకుపోయాయి. మందపల్లె, తొగూరుపేట, పాపరాజుపల్లె గ్రామాలు నీటమునిగి వరదంతా ఈ గ్రామాల్లో ప్రవహించింది. తద్వారా ప్రాణనష్టం జరిగింది. వర్షాకాలం మొదలైంది. వరద వస్తే తిరిగి ఈ గ్రామాల్లోని నీరంతా ప్రవహించి భారీఎత్తున ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉంది. వెంటనే నదికి ఆనుకుని ఉన్న ఈ ప్రాంతాల్లో జగతికట్టలు (రక్షణ గోడలు) ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.
- ఈ ప్రాంతంలో వ్యవసాయం కుంటుపడి ఉపాధి అవకాశాలు లేనందున ప్రత్యేకంగా ఉపాధి హామీ పథకాలను ఎక్కువగా నిర్వహించి ప్రజలు వలస పోకుండా ఆదుకోవాల్సి ఉంది.
- ఇంత భారీఎత్తున విపత్తు జరిగి అన్నివిధాలా నష్టపోయిన వీరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇకనైనా గుర్తించి దీనిని జాతీయ విపత్తుగా గుర్తించి ప్రత్యేక సహాయ నిధి కింద ఆదుకోవాలి. దీనిపై రాష్ట్ర ప్రభుత్వంలో ప్రధాన భూమిక పోషించే పవన్‌కళ్యాణ్ ప్రత్యేక శ్రద్ధ చూపాలని బాధితులు కోరుతున్నారు.


రక్షణగోడ కొట్టుకుపోయి నేటికీ జగతి కట్టలేక ఇబ్బంది పడుతున్న మందపల్లె గ్రామం


కనీసం రోడ్డు కూడా లేని పులపత్తూరు పునరావాస ప్రాంతం

### ఇంతవరకు ఎవరూ ఆదుకోలేదు..



దుర్ఘటన జరిగి మూడేళ్లు అవుతున్నా ప్రభుత్వం నుంచి మమ్మల్ని ఎవరూ ఆదుకోలేదు. దాతలు సహకరించకపోతే మేము బతికేవాళ్లం కాదు. ప్రభుత్వం కంటే దాతలే మమ్మల్ని ఆదుకున్నారు. స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి జగనే వచ్చి హామీలు ఇచ్చినా ఇంతవరకు ఒకటీ నెరవేరలేదు. మూడేళ్లు అవుతున్నా కనీసం పక్కాగృహాలు పూర్తి కాలేదంటే ఏమి చేయాలి. ఇకనైనా కొత్త ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- అరుణాచలం, మాజీ సర్పంచ్, తొగూరుపేట

### ఇళ్లు పూర్తి చేయలేదు..



మా స్వగ్రామం తొగూరుపేట. ప్రాజెక్టు తెగిపోవడం వల్ల మా గ్రామమంతా నీటమునిగింది. పశువులన్నీ చనిపోయాయి. మా ఊరి గుట్ట మీద ఇంటి నిర్మాణాలు చేపట్టాం. ఇంకా ఇళ్లు పూర్తి కాలేదు. కావున వెంటనే ఇళ్లు పూర్తి చేయాలి. మా గ్రామమంతా పాడిపైనే ఆధారపడి ఉంటుంది. పశువులన్నీ చనిపోవడం వల్ల మాకు జీవనభృతి కరవైంది. మాకు ప్రత్యేక ప్యాకేజీ కింద ప్రత్యేక నిధులు కేటాయించి ఆదుకోవాలి.

- శివరామయ్య, పాడి రైతు, తొగూరుపేట

### కనీస సౌకర్యాలు కల్పించకపోతే ఎలా..



సంఘటన జరిగి మూడేళ్లు కావస్తున్నా ఇంతవరకు మౌలిక సదుపాయాలు కల్పించకపోతే మేము ఏమి చేయాలి. నేను సర్పంచ్‌గా ఏమీ చేయలేని పరిస్థితుల్లో ప్రజలకు సమాధానం చెప్పుకోలేకపోతున్నాం. కొత్త ప్రభుత్వం స్పందించి ముంపునకు గురైన పులపత్తూరు, మందపల్లె, తొగూరుపేట, రామచంద్రాపురం తదితర గ్రామాల్లో రైతులను ఆదుకుని కనీసం రోడ్లు, మంచినీటి సౌకర్యం, విద్యుత్తు, ఉపాధి అవకాశాలు కల్పించాలి.

- భీము శ్రీదేవమ్మ, సర్పంచ్, పులపత్తూరు

# విషాదం నింపిన విద్యుత్

**కడప జిల్లాలో వేర్వేరుచోట్ల విద్యుత్ షాక్‌తో ముగ్గురు మృతిచెందగా ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. కడప నగరంలోని బెల్లంమండీ వీధిలో నివాసం ఉంటూ రోజూ కలసి పాఠశాలకు వెళ్లి వచ్చే ఇద్దరు విద్యార్థులు.. బుధవారం మధ్యాహ్నం రోడ్డుపై వేలాడుతున్న కేబుల్ వైరు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. జమ్మలమడుగు మండలం రామిరెడ్డిపల్లెలో నీళ్ల కోసం స్విచ్ వేస్తుండగా ఒకరు.. మైలవరం మండలం నవాబుపేటలో నీళ్ల కోసం మోటారు ఆన్ చేసేందుకు వైర్లు తగిలిస్తుండగా షాక్‌కు గురై మరొకరు మృతిచెందారు.**

- విద్యుత్ షాక్‌తో.. ముగ్గురు మృతి
- ఒకరికి తీవ్ర గాయాలు


కడపలో విద్యుత్ షాక్‌తో కిందపడుతున్న విద్యార్థులు

### కేబుల్ తగిలి..

కడప (క్రైం), ఆగస్టు 21: కడప నగరంలోని బెల్లంమండీ వీధికి చెందిన అబ్దుల్ రెహ్మాన్ కుమారుడు తంజూరు రెహ్మాన్ (11), అజ్మత్ ఆలీ కుమారుడు షేక్ అదనన్ ఆలీ (11) స్నేహితులు. వీరిద్దరూ టూటౌన్‌లోని ప్రైవేటు స్కూలులో ఐదో తరగతి చదువుతున్నారు. బుధవారం మధ్యాహ్నం ఇంటికి వచ్చి భోంచేసిన తరువాత తిరిగి సైకిల్‌లో స్కూలుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని టైటాన్ బిల్డింగ్ వద్దకు రాగానే వేలాడుతున్న కేబుల్ తంజూరు రెహ్మాన్‌కు తగలడంతో ఒక్కసారిగా ఇద్దరూ విద్యుత్‌షాక్‌కు గురై కింద పడిపోయారు. గుర్తించిన స్థానికులు వారిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో తంజూరు రెహ్మాన్ మృతి చెందగా మరో విద్యార్థి షేక్ అదనన్ తీవ్రంగా గాయపడ్డాడు. టూటౌన్ సీఐ నాగార్జున, ఎస్ఐ హుసేన్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేబుల్‌ను రోడ్డులో నుంచి తొలగించారు. చికిత్స పొందుతున్న బాలుడిని పరామర్శించారు. పిల్లల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ ప్రమాదానికి కారణం విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే అని బాధితులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దగ్గరున్న రెండు ఎర్త్‌వైర్‌లు తెగి కేబుల్‌కు తాకుతున్నాయని తెలిపారు. ఈ కేబుల్ విద్యార్థులకు తాకగానే షాక్ గురయ్యారని ఇది పూర్తిగా విద్యుత్ శాఖ నిర్లక్ష్యమే అని బాధితులు పేర్కొన్నారు. ఏది ఏమైనా క్షణకాలం వ్యవధిలో ఓ విద్యార్థి నిండు జీవితం బలి కాగా మరో విద్యార్థి వికలాంగుడిగా మారిపోవడం అందరినీ కలచివేసింది.


మృతి చెందిన తంజూరు రెహ్మాన్


చికిత్స పొందుతున్న అదనన్ ఆలీ

### నీటి కోసం స్విచ్ వేస్తుండగా..


మృతి చెందిన పద్మజ

జమ్మలమడుగు, ఆగస్టు 21: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని రామిరెడ్డిపల్లెలో బుధవారం బొందల పద్మజ (23) అనే వివాహిత విద్యుత్తు షాక్ తగిలి మృతిచెందారు. పోలీసుల వివరాల మేరకు.. బొందల పద్మజ బుధవారం ఉదయాన్నే నీళ్ల మోటారు స్విచ్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఘటనా స్థలంలో కుప్పకూలిపోయారు. స్థానికులు వెంటనే జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతురాలిది ఆళ్లగడ్డ మండలం కొండంపల్లె గ్రామం. మూడు సంవత్సరాల క్రితం రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్రీనాద్‌తో వివాహం జరిగింది. ఈమె భర్త కూల్‌డ్రింక్ షాపు వ్యాపారం చేసి జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

### నవాబుపేటలో..


మృతి చెందిన సంజన్న

మైలవరం, ఆగస్టు 21: పంచాయతీ కుళాయికి పైప్ తగిలించి ఇంటిలోకి నీటి కోసం మోటారు వేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై రొడ్డా సంజన్న (68) మృతి చెందాడు. తలమంచిపట్నం ఎస్ఐ లక్ష్మీనారాయణ వివరాల మేరకు.. మైలవరం మండల పరిధిలోని నవాబుపేట గ్రామానికి చెందిన రొడ్డా సంజన్న తమ ఇంటికి కొంచెం దూరంలో ఉన్న పంచాయతీ కుళాయికి పైప్ తగిలించి రెండు వైర్లు మోటారు వద్ద పెట్టే క్రమంలో చేతికి విద్యుత్ షాక్ కొట్టడంలో స్పృహ తప్పి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆయనను జమ్మలమడుగు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే సంజన్న మృతిచెందాడని తెలిపారు. ఈ మేరకు సంజన్న భార్య సుబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సంజన్నకు భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు.


అన్నమయ్య వరద బాధిత గ్రామాల్లో పర్యటిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

# ముంపు గ్రామాల్లో కలెక్టర్, ఎస్పీ

రాజంపేట, ఆగస్టు 21: ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈనెల 23న అన్నమయ్య ప్రాజెక్టు ముంపు గ్రామాల్లో పర్యటిస్తున్న సందర్భంగా కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు బుధవారం పర్యటించారు. వీరి వెంట రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోం నిదియాదేవితో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, అన్నమయ్య ప్రాజెక్టు ఈఈ రవికిరణ్, ఎస్ఈ వెంకటరమణ, జిల్లా ఉన్నతాధికారులు, డివిజన్ అధికారులు పాల్గొన్నారు. ముందుగా కలెక్టర్ పులపత్తూరు, అరుంధతివాడలో పర్యటించారు. వరదల్లో దెబ్బతిన్న ప్రాంతాలను, ఇళ్లను చెయ్యేరు నది పరీవాహక ప్రాంతాన్ని, బాధితులకు నిర్మిస్తున్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు.

పూర్తయిన ఇళ్లు ఎన్ని, ఏయే దశల్లో ఇంటి నిర్మాణాలు ఉన్నాయి, వారికి అందిన మొత్తంపై ఆరా తీశారు. పంటల నష్టపరిహారం గురించి ఆరా తీశారు. ఇంటి నిర్మాణాలకు సంబంధించిన ఆర్థికసాయం పూర్తిగా ఇంతవరకు అందలేదని బాధితులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. గృహ నిర్మాణదారులకు ఇచ్చిన సిమెంట్ బస్తాలు, స్టీలు, వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలకు అందిన పరిహారంపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడం వల్ల దెబ్బతిన్న గ్రామాల్లో తిరిగి రీసర్వే చేయించి ఇంకా నష్టపరిహారం అందాల్సిన బాధితులు ఎవరైనా ఉంటే వారిని గుర్తించి న్యాయం చేస్తామని తెలిపారు. ఈనెల 23న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఈ ప్రాంతాలకు రానున్నారని, ఆయన రాక సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా ఆయా శాఖలు తీసుకోవాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఎస్పీ పర్యటన

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రాక సందర్భంగా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యటించారు. డిప్యూటీ సీఎం పర్యటన సందర్భంగా ఈ ప్రాంతంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ఆయన ఆ ప్రాంతాలను పరిశీలించారు. రాజంపేట పోలీసు అధికారులతో కలిసి ఉప ముఖ్యమంత్రి పర్యటనలో తీసుకోవాల్సిన బందోబస్తు వివరాలపై పలు ఆదేశాలు జారీ చేశారు. టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజుతో కలిసి పర్యటన వివరాలను, తీసుకోవాల్సిన బందోబస్తు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.


పులపత్తూరులో కలెక్టర్ శ్రీధర్, సబ్ కలెక్టర్ నిదియాదేవి, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

## ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పర్యటన వివరాలు



రాజంపేట, ఆగస్టు 21: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెల 23వ తేదీ శుక్రవారం రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాల్లో పర్యటించనున్నారు. 23వ తేదీ ఉదయం 8.05 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి విమానంలో బయలుదేరి 9.05 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. 9.10 గంటలకు అక్కడి నుంచి రోడ్డుమార్గాన రైల్వేకోడూరులోని మైసూరివారిపల్లెకు బయలుదేరి 10 గంటలకు చేరుకుంటారు. 11.30 గంటల వరకు అక్కడ జరిగే గ్రామసభలో పాల్గొంటారు. అనంతరం రోడ్డుమార్గాన బయలుదేరి రాజంపేట నియోజకవర్గంలోని అన్నమయ్య వరద ప్రభావిత ప్రాంతమైన పులపత్తూరు గ్రామానికి మధ్యాహ్నం 12.45 గంటలకు చేరుకుని అక్కడి గ్రామస్తులతో మాట్లాడి అక్కడి పరిస్థితులను పరిశీలిస్తారు. 1.45 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రాజంపేటలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకుని విశ్రాంతి తీసుకుంటారు. 3.05 గంటలకు రాజంపేట నుంచి బయలుదేరి 4.35 గంటలకు రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని విమానంలో గన్నవరం బయలుదేరి వెళతారు.

### ముంపు బాధితుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం : చమర్తి

ముంపు బాధితుల సమస్యలన్నింటినీ సత్వరం పరిష్కరిస్తామని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రాక సందర్భంగా ఈ పర్యటన విజయవంతంపై కలెక్టర్, ఎస్పీలతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ రాకతో బాధితుల సమస్యలన్నింటిని కూటమి ప్రభుత్వం పరిష్కరిస్తుందని తెలిపారు.

# పవన్ పంచ్‌లపై.. ఆశల మోసులు

- రైల్వేకోడూరులో వెక్కిరిస్తున్న దీర్ఘకాలిక సమస్యలు
- పరిష్కరిస్తారని.. ప్రజల ఎదురు చూపులు
- ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో...

రైల్వేకోడూరు, ఆగస్టు 21: అందరూ ఊహించిన విధంగానే రాష్ట్రంలో రాక్షస పాలన పోయి కూటమి ప్రభుత్వం వచ్చింది. రైల్వేకోడూరు అసెంబ్లీ స్థానంలో 2004 నుంచి టీడీపీ ఓటమి పాలవుతోంది. 2024లో జరిగిన ఎన్నికల్లో రైల్వేకోడూరు టిక్కెట్టును జనసేన పార్టీ కి కేటాయించడం.. విజయం సాధించడం జరిగింది. ఈ నేపథ్యంలో రైల్వేకోడూరు నియోజకవర్గంపై పై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్



నిధులు లేక నిలిచిపోయిన గాలేరు-నగరి కాల్వ పనులు



అటవీ అనుమతులు లేక ఆగిపోయిన కోడూరు-వెంకటగిరి రోడ్డు

ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఇదిలా ఉండగా... గత ఎన్నికల ప్రచారంలో అప్సా జ్యూస్ పరిశ్రమ తిరిగి ప్రారంభిస్తామని, పెండింగ్‌లో ఉన్న రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు, పెనగలూరులో సోమశిల బ్యాక్ వాటర్ లిఫ్ట్ ఇరిగేషన్, గాలేరు-నగిరి కాలువ, రైతులకు శీతలగిడ్డంగులు, మామిడి, బొప్పాయి, అరటికి గిట్టుబాటు ధరలు, ఎర్రచందనం చెట్ల పరిరక్షణ తదితర హామీలు ఇచ్చారు. కాగా, పవన్‌కళ్యాణ్ త్వరలో రైల్వేకోడూరు నియోజకవర్గంలో పర్యటన ఉండటంతో నియోజకవర్గ ప్రజలు గంపెడాశ పెట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే....

రైల్వేకోడూరు ఎస్సీ నియోజకవర్గం అయినప్పటికీ జిల్లాలో రాజకీయంగా ప్రధాన భూమిక సంతరించుకుంది. నియోజకవర్గంలో ఎక్కువగా ఉద్యాన పంటలు మామిడి, అరటి, బొప్పాయి పంటలను రైతులు పండించి ఇతర దేశాలు, రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రధానంగా రైతులకు పంటలను నిల్వ చేసేందుకు వీలుగా శీతలగిడ్డంగులు లేవు. దీంతో కోసిన పంటను వెంటనే ఎగుమతి చేయాల్సిన పరిస్థితి. మార్కెట్‌లో ఏ ధర ఉంటే ఆధరలకు రైతులు అమ్ముకోవాల్సి ఉంటుంది. ఇక రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డు పనులు సుమారు 30 ఏళ్లగా పెండింగ్‌లో ఉన్నాయి. ఇటు రైల్వేకోడూరు అటు వెంకటగిరి వరకు ఇరువైపులా రోడ్డును పూర్తి చేశారు. అటవీ అనుమతి లేక రోడ్డు పూర్తి కాలేదు. అలాగే అనంతరాజుపేట వద్ద అప్సా జ్యూస్ పరిశ్రమ సుమారు 30 ఏళ్ల క్రిందట మూత పడింది. రెండుసార్లు ప్రైవేటు వ్యక్తులు లీజుకు తీసుకుని కొంత కాలం నడిపి చేతులెత్తేశారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి అప్సాజ్యూస్ పరిశ్రమను ప్రారంభిస్తామని చెబుతున్నారే తప్ప పట్టించుకునే నాథుడు లేడు. ఈ పరిశ్రమను తెరిపిస్తే వందల మందికి ఉపాధి కలుగుతుంది. ప్రతి ఏటా కురుస్తున్న వర్షాలకు రైల్వేకోడూరు పట్టణంలోని నరసరాంపేట, ధర్మాపురం నదీపరివాహక ప్రాంతాలలో నివాసాలు ఉంటున్న ప్రజల ఇళ్లు వరద తాకిడికి కొట్టుకుపోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రూ.18 కోట్లతో రక్షణ గోడ నిర్మాణానికి భూమి పూజలు చేసినా.. కార్యరూపం దాల్చలేదు. అలాగే సుమారు రూ. 12 కోట్లతో సాగుతున్న రెడ్డివారిపల్లె రైల్వే అండర్ బ్రిడ్జి నత్తనడకన సాగుతోంది. గత కొన్నేళ్లుగా గాలేరు-నగిరి కాలువ పనులు నిలిచిపో యాయి. నిధులు లేక కాలువను పూర్తి చేయలేదు. కాలువ పూర్తి అయి ఉంటే రైల్వేకోడూరు నియోజకవర్గం శస్యశ్యామలం అయి ఉండేది.

రైల్వేకోడూరు నియోజకవర్గంలో అటవీ ప్రాంతం ఎక్కువ విస్తీర్ణంలో ఉంది. దీంతో ఎర్రస్మగ్లర్లు స్మగ్లింగ్‌ను కుటీర పరిశ్రమగా చేసుకున్నారు. చాలా మందిపై పీడీ యాక్టులు పెట్టినా ఫలితం లేదు. కొందరు అధికారులు, రాజకీయ నేతల అండతో స్మగ్లర్లు రెచ్చిపోతున్నారు. ఇప్పటికే అటవీ సంపదను దోచుకుని లూటీ చేశారు. కోట్లాది రూపాయల విలువ చేసే ఎర్రచందనాన్ని దోచుకుని స్మగ్లర్లు సొమ్ము



మంగంపేట ముగ్గురాయి గనులు




మూతపడిన అప్సా జ్యూస్ పరిశ్రమ

చేసుకున్నారు. ఎర్రచందనం సంపద పై ప్రత్యేక చట్టాలు తీసుకుని వస్తే తప్ప మరో దారి లేదు.

మంగంపేట బెరైటీస్ గనుల్లో కోట్లాది రూపాయల మేరకు వైసీపీ ప్రభుత్వంలో అక్రమాలు జరిగాయి. ఉద్యోగాల నియామకాలు, ఆస్పత్రి, స్కూలులో భోజనాలు, క్యాంటిన్ లో దోపిడీలు, అక్రమంగా తరలిన ముగ్గురాయి తదితర వాటిపై విచారణ వేగవంతం చేయాలని కార్మిక వర్గాలు డిమాండు చేస్తున్నాయి. ఇదే కాకుండా మంగంపేటలో గత మూడు నెలలుగా ముగ్గురాయి రవాణా ఆగిపోయింది. వెంటనే రవాణా సాగించాలని పలువురు కోరుతున్నారు. దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పరిష్కరించి.. నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ప్రజలు నమ్మకం పెట్టుకున్నారు.

## యూనివర్శిటీ అధ్యాపకులకు ఎంటీఎస్ అమలు చేయాలి



ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం అందిస్తున్న వైవీయూ అకడమిక్ కన్సల్టెంట్ బృందం

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 21: వైవీయూ అకడమిక్ అధ్యాపకులకు ఎంటీఎస్ అమలు చేయాలని అకడమిక్ కన్సల్టెంట్ బృందం కోరింది. బుధవారం కడప నగరం ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డిని కలిసి వినతులు సమర్పించిన వారు మాట్లాడుతూ టెట్, నెట్, పీహెచ్‌డీ అర్హత కలిగి అతి తక్కువ వేతనాలతో విద్యాలయాల్లో పనిచేస్తున్న తమకు ఎంటీఎస్ అమలు చేసేలా చూడాలని కోరారు. 2019లో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు విశ్వవిద్యాలయాల్లో పనిచేసే అకడమిక్ కన్సల్టెంట్లకు ఎంటీఎస్ అమలు చేసేందుకు సీబీఎస్ వెంక టరమణ పేరుతో కమిటీ నియమించి.. అమలు దశలో ఎన్నికలు రావడంతో అర్థాంత రంగా ఆ ప్రక్రియ ఆగిందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తరువాత వచ్చిన ప్రభుత్వం 110 జీఓ ఇచ్చిందని, అయితే అది విశ్వవిద్యాలయాల్లో పూర్తి అమలు చేయలేదని తెలిపారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద అధ్యాపకులకు రూ.62వేలు జీతం ఇస్తున్నారని, యూనివర్శిటీల్లో పనిచేసే తమకు రూ.35వేలు ఇస్తున్నారన్నారు. తమకు కూడా రూ.57వేల నుంచి 80 వేల వరకు సర్వీసును బట్టి వేతనం ఇవ్వాలని కోరారు. ఎంటీఎస్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళతామని.. అసెంబ్లీలో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. అకడమిక్ కన్సల్టెంటు ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

## వీరబ్రహ్మేంద్రస్వామి మఠం దేవదాయశాఖ స్వాధీనం



మఠాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 21: స్థానిక ఆర్టీపీపీ రోడ్డులోని వీరబ్రహ్మేంద్రస్వామి మఠంను బుధవారం దేవదాయ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సుంకు వెంకటసుబ్బయ్య సత్రానికి చెందిన సర్వే నంబరు 57/3లోని 1.75 ఎకరాల స్థలంలో మఠాన్ని నిర్మించారు. మఠం స్థాపకులకు సుంకు వెంకటసుబ్బయ్య సత్రం ఈవో నోటీసులు ఇచ్చినా వారు స్పందించలేదు. దీంతో దేవాదాయ శాఖ చట్టం మేరకు పంచనామా నిర్వహించి ఒక ఇళ్లు, మండపం, ఖాళీ స్థలం, ఇతర అస్తులను స్వాధీనం చేసుకున్నారు. ఇక మీదట మఠాన్ని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ నరసింహసింగ్, సుంకుసత్రం ఈవో రామచంద్రాచార్యులు, వీఆర్వో రవి, సర్వేయర్ సురేంద్ర, రాజేష్, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## సెప్టెంబరు 6 నుంచి కోదండరామ స్వామి ఆలయంలో బాలాలయం

ఒంటిమిట్ట, ఆగస్టు 21: ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో సెప్టెంబరు 6 నుంచి 8వ తేదీ వరకు బలాలయం నిర్వహించనున్నారు. సెప్టెంబరు 6న సాయంత్రం 5.30 గంటలకు అంకురార్పణతో టీటీడీ అర్చకులు ప్రారంభించనున్నారు. సాధారణంగా గర్భాలయంలో జీర్ణోద్ధరణ కోసం బలాలయం చేపడతారు. ఇందుకోసం ఆలయంలోని మండపంలో నమూన ఆలయం ఏర్పాటు చేసి.. గర్భాలయంలోని మూలవర్ల చిత్రపటాలను ఏర్పాటు చేస్తారు. తదుపరి మహాసంప్రోక్షణ చేసి.. స్వామి అమ్మవార్లకు నిత్యకైంకర్యాలను స్వామివారి చిత్రపటాలకు నిర్వహించనున్నారు. ఆలయంలోని యాగశాలలో సెప్టెంబరు 7, 8 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతారు. 8వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల మధ్య తులాలగ్నంలో బలాలయ సంప్రోక్షణ నిర్వహించడం జరుగుతుందని టీటీడీ అధికారులు తెలిపారు.

## ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా చేయడమే లక్ష్యం



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల అధికారి

రాయచోటిటౌన్, ఆగస్టు 21: నిరుద్యోగులను ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా తయారు చేయడమే లక్ష్యమని జిల్లా పరిశ్రమలశాఖ అధికారి సూరిబాబు పేర్కొన్నారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఐఎల్‌వో సంయుక్త ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా పరిశ్రమలశాఖ అధికారి సూరిబాబు మాట్లాడుతూ ఈ శిక్షణలో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తయారవడానికి కావాల్సిన మెలుకువలు, వ్యాపార నిర్వహణ శక్తి, సామర్థ్యాలు గురించి మహిళలు, వ్యాపారంలో రాణించటానికి కావాల్సిన వివిధ రకాల అనుమతులు గురించి తెలియజేశారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న వ్యాపార అవకాశాల గురిం చి తెలియజేశారు. ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి హరికృష్ణ జిల్లా లో చదువుకొని ఖాళీగా ఉన్న నిరుద్యోగులకు ఔత్సాహిక వ్యాపారవేత్తలుగా ఎదగ డానికి కావాల్సిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అలాగే శిక్షణ పూర్తయిన వారికి సర్టిఫికెట్‌తో పాటు బ్యాంకు రుణ సౌకర్యం కూడా కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎల్‌వో మాస్టర్ ట్రైనర్ సునేమ, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కారు - మోటరు బైకు ఢీ.. ఇద్దరు మృతి



మృతి చెందిన సాయికుమార్‌రెడ్డి, తరుణ్

పోరుమామిళ్ల, ఆగస్టు 21: స్థానిక మల్లకతవ వద్ద బుధవారం సాయంత్రం కారు-మోటరు బైకులు ఢీ కొన్న సంఘటనలో సాయి కుమార్‌రెడ్డి (19), తరుణ్ (17) అనే యువకులు మృతి చెందారు. కలసపాడు మండలం ఎగువరామాపురం గ్రామానికి చెందిన సాయికుమార్‌రెడ్డి, తరుణ్‌లు బుధవారం సాయంత్రం పోరుమామిళ్ల నుంచి స్వగ్రామానికి వెళుతుండగా.. రామేశ్వరం నుంచి పోరుమామిళ్లకు ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ తరుణ్‌కు, సాయికుమార్ రెడ్డిలను పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి డాక్టర్ల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ ఇద్దరు మృతి చెందారు. వీరి మృతితో ఎగువ రామాపురంలో విషాధచాయలు అలుముకున్నాయి.

## వ్యక్తి అనుమానాస్పద మృతి



చిన్నరెడ్డెయ్య (ఫైల్‌ఫొటో)

రాయచోటిటౌన్, ఆగస్టు 21: రాయచోటి మండల పరిధిలోని యండపల్లె గ్రామం మునల్‌రెడ్డిగారిపల్లెకు సమీపంలో మంగళవారం చిన్నరెడ్డెయ్య (49) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.... మునల్‌రెడ్డిగారిపల్లెకు చెందిన చిన్నరెడ్డెయ్యకు ఇరువురు భార్యలు. మొదటి భార్య విడాకులు తీసుకుని విడిపోయిన అనంతరం వెంకటలక్ష్మమ్మ అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక కుమార్తె కలదు. భార్య వెంకటలక్ష్మి కువైత్‌కి వెళ్లి తిరిగి వస్తూ ఉండేది. చిన్నరెడ్డెయ్య మద్యానికి అలవాటు పడి ప్రతిరోజు మద్యం సేవించడంతో పాటు జూదం తదితర వాటికి బానిస అయ్యాడు. దీంతో ఆరు నెలల క్రితం కువైత్ నుంచి వచ్చిన భార్య వెంకటలక్ష్మి అతని ప్రవర్తన సరిగా లేకపోవడంతో నెల రోజులుగా అమ్మగారి ఇంటి వద్ద ఉంటోంది. కాగా, కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న చిన్నరెడ్డెయ్య మద్యం సేవించి గతంలో ఒకసారి కుమార్తెకు ఫోన్ చేసి మీ నాయిక ఇక లేడని చెప్పాడు. ఈ క్రమంలో మంగళవారం ఒంటిమామిడి చెట్టు వద్ద పడిపోయి ఉండ టంతో.. మద్యం సేవించి ఊపిరి ఆడక మృతి చెందాడా.. లేక విషం తీసుకొని చనిపోయాడా అనే అనేది విచారణలో తేలాల్సి ఉంది. భార్య ఫిర్యా దు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించి.. కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ నరసింహులు తెలియజేశారు.

## బ్రహ్మంగారి మఠంలో...



సుధాకర్‌రెడ్డి మృతదేహం

బ్రహ్మంగామఠం, ఆగస్టు 21: బ్రహ్మంగారి మఠంలోని విరాట్‌లాడ్జిలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు మైదుకూరు మండలం భూమాయపల్లెకు సమీపంలోని కొత్తపల్లికి చెందిన సుధాకార్‌రెడ్డిగా గుర్తించి.. వారి కుటుంబ సభ్యులకు విషయం తెలియజేశారు. మృతుని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే.. కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తామని ఎస్ఐ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



సుండుపల్లె, ఆగస్టు 21: మండలంలోని మాచిరెడ్డిగరిపల్లె గ్రామ పంచాయతీ వంకబిడికి చెందిన మూడే యశ్వంత్ నాయక్ (24) మృతి చెందాడు. బంధువుల వివరాల మేరకు... బెంగుళూరులో యశ్వంత్ నాయక్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా జాబ్ చేస్తూ ఉండేవాడు. బైక్‌లో పాండిచ్చేరి వెళ్లి వస్తుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడని తెలిపారు వీరి తండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. కాగా మృతుడు మూడు నెలల క్రితమే సాఫ్ట్‌వేర్ ఉద్యో గంలో జాయిన్ కాయినట్లు తెలిపారు. యశ్వంత్ నాయక్ మృతితో మాచిరెడ్డిగారిల్లెలో విషాధచాయలు అలుముకున్నాయి.

## గ్రామ సభలను విజయవంతం చేయాలి : కలెక్టర్



వీసీ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటిశివశంకర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 21: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 23న ప్రతిష్టాత్మకంగా ప్రారంభించనున్న గ్రామ సభలను జిల్లాలోని అన్ని పంచాయితీల్లో విజయవంతం చేయాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో గ్రామ సభల సంసిద్ధతపై అన్ని మండలాల క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 23న గ్రామ సభలను ఆయా మండల ప్రత్యేక అధికా రులు ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించి... గ్రామాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తారన్నారు. గ్రామ సభలకు స్థానిక ప్రజా ప్రతినిధులను, సామాజిక బాధ్యత వహించే ప్రతి ఒక్కరినీ భాగస్వాములు చేయాలన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే అభివృద్ధి పనుల గుర్తింపు ప్రణాళికా ప్రక్రియను రూపొందించుకునేందుకు సర్పంచ్ అధ్యక్షతన గ్రామ సభలు నిర్వహిస్తామన్నారు. అందుకు ఆయా మండలాల ఈఓపీఆర్డీలు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు, పంచాయతీ సెక్రటరీలు సంబంధిత పనులపై సమీక్షించుకుని.. వాటిపై చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ సభలు పూర్తయిన వెంటనే ప్రభుత్వం రూపొందించిన ఈఎంఎంఎస్ యాప్ ద్వారా ఫొటోలు, వీడియోలు, సంబధిత మినిట్స్ నోట్ డాక్యుమెంట్లను అప్‌లోడు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ తాగునీటి సరఫరాలో ఎక్కడా అంతరాయం లేకుండా పనులు చేపట్టాలన్నారు. అక్టోబరు 2 నుంచి ప్రారంభం కానున్న నూతన గృహ నిర్మాణాల్లో ప్రతి ఇంటికీ కచ్చితంగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. డ్వామా పీడీ జోయల్ విజయకుమార్, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, జడ్పీ సీఈఓ సధాకర్‌రెడ్డి, పశుసంవర్థక శాఖ జేడీ డాక్టర్ శారదమ్మ ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ, తహసీల్దార్లు, ఎంపీడీఓలు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ రహదారి పనులను పరిశీలించిన జేసీ



అధికారులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఆదిత్‌సింగ్

చాపాడు, ఆగస్టు 21: మండలంలో నిర్మిస్తున్న బెంగుళూరు-అమరావతి జాతీయ రహదారిని జాయింట్ కలెక్టర్ ఆదిత్‌సింగ్ బుధవారం పరిశీలించారు. కేతవరం గ్రామం గ్రామం వద్ద వేస్తున్న రోడ్డు నిర్మాణం పనులను, విశ్వనాథపురం గ్రామం వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జిని ఆమె పరిశీలించారు. నేషనల్ హైవే అథార్టి అధికారులతో, తహసీల్దారు రవీంద్రారెడ్డి, డిప్యూటీ తహసీల్దారు యామినితోనూ జేసీ మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి సేకరించిన భూములకు సంబందించి రైతులకు నష్టపరిహారం ఇంకా ఎంతమందికి ఇవ్వాల్సి ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నష్టపరిహారం మంజూరుకాని రైతుల వివరాలను తమకు పంపాలన్నారు. కార్యాలయంలో భద్రపరిచిన రెవెన్యూ రికార్డులను ఆమె పరిశీలించారు. అలాగే ఎస్.మైదుకూరులో నిర్మిస్తున్న బెంగుళూరు-అమరాతి హైవే రోడ్డు, బ్రిడ్జి కూడా ఆమె పరిశీలించారు.

## గంజాయి విక్రయదారుల అరెస్టు



ప్రొద్దుటూరు, ఆగస్టు 21: ప్రొద్దుటూరులో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న గంజాయివిక్రయాలపై పోలీసులు దాడులు చేశారు. బుధవారం డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో రాబడిన సమాచారం మేరకు స్థానిక కొప్పూరు గ్యారేజీ వద్ద గల ఖాళీ స్థలంలో గంజాయి విక్రయాలు జరుపుతున్న నలుగురు వ్యక్తులను టూటౌన్ సీఐ యుగంధర్, ఎస్ఐ ధనుంజయుడులు అదుపులోకి తీసుకు న్నారు. వీరి వద్ద నుంచి 4 కేజీల గంజాయి, రెండు మోటార్ బైకులు, నాలుగు సెల్ ఫోన్‌లు, రూ.33 వేల నగదును సీజ్ చేసి స్వాధీనం చేసుకున్నారు. వీరు వైజాగ్ నుంచి కిరణ్ అనే వ్యక్తి ద్వారా ప్రొద్దు టూరుకు ప్రైవేటు ట్రావెల్స్‌లో పూతరేకులు వ్యాపారం ముసుగులో గంజాయిని అట్టపెట్టెలలో తీసుకొస్తున్నట్లు విచారణలో వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన వారిలో షేక్ అహ్మద్ , మంజుల వేణు, షేక్ అజ్మతుల్లా, నాదీండ్ల సలీమ్ ఉనానరు. వీరంతా ఎర్రగుంట్లకు చెందిన రాణివనం శాంతినగర్‌కు చెందిన వారుగా పోలీసులు తెలిపారు. వీరందరిని అరెస్టు చేసి.. వారిపై మాదకద్రవ్యాల అక్రమ రవాణ విక్రయాలు జరుపుతు న్నట్లు కేసు నమోదు చేసి రిమాండ్‌కు పెట్టినట్లు డీఎస్పీ భక్తవత్సలం తెలిపారు

## యువకుడి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, అగస్టు 21: స్థానిక కాల్వకట్టవీధిలో బుధవారం ఇంట్లో ఉరివేసుకుని లోకేష్‌కుమార్ (21) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్ప డినట్లు త్రీటౌన్ సీఐ గోవిందరెడ్డి తెలిపారు. వివరాలిలా.. లోకేష్‌కుమార్ బేల్దారి పనులు చేసేవాడు. అతనికి అపుడపుడు మూర్ఛ వస్తుండేది. ఈ క్రమంలోనే మంగళవారం రాత్రి మూర్ఛవచ్చి కొద్ది సేపటికి తగ్గిపోయింది. కాసేపు పండుకుంటానని ఇంట్లోకి వెళ్లిన లోకేష్ బయటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లిచూడగా.. అప్పటికే ఇంట్లో చీరతో ఉరి వేసుకుని అత్మహత్య చేసుకున్నాడు. మూర్ఛ వస్తుందనే బాధతో మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

## 68 మద్యం బాటిళ్లు స్వాధీనం

సింహాద్రిపురం, ఆగస్టు 21: మండల పరిధిలోని తెలికి, బిదినంచెర్ల గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై బుధవారం దాడులు నిర్వహించి 68 అక్రమ మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని.. వరకుమార్, కార్తీక్‌కుమార్‌రెడ్డి అనే వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తులసినాగప్రసాద్ తెలిపారు. మండలంలో ఏ గ్రామంలోనైనా అక్రమ మద్యం అమ్మకాలు, జూదం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## 20 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



సిద్దవటం, ఆగస్టు 21: మండలంలోని ఫారెస్ట్ ఏరియా ఎర్రమనుశీల వద్ద మంగళవారం రాత్రి తొమ్మిది మంది తమిళ స్మగ్లర్లను అరెస్టు చేసి.. 20 ఎర్రచందనం దుంగలను, ఒక కారును స్వాధీనం చేసుకున్నట్లు కడప ఫారెస్ట్ రేంజి అధికారి ప్రసాద్ తెలియజేశారు. వీటి విలువ 3 లక్షలు రూపాయలు ఉంటుందని తెలిపారు. నిందితులను తిరుపతి ఫారెస్ట్ కోర్టుకు హాజరు పరిచామని తెలిపారు. ఎక్కడైనా చందనం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని.. వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలియజేశారు. అటవీశాఖ బీట్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

చిట్వేలి, ఆగస్టు 21: చిట్వేలి మంగళంపల్లి రహదారిలో స్తంభారాయుడు ఆలయం సమీపంలో నూతనంగా నిర్మించిన పార్వతి పరమేశ్వర, మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి శిలా బింబ శిఖర, విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి 21వ తేది బుధవారం వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మేరకు బుధవారం వేకువజామున యంత్ర, శిఖర, విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం 11 గంటలకు స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులపండుగలా నిర్వహించారు. ఆలయ కమిటీ గ్రామస్థుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మిలు స్వామివారి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వీరిని ఆలయకమిటీ వారు శాలువాలతో, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమాలకు వీరబ్రహ్మేంద్ర స్వామిమఠం కందిమల్లయ్యపల్లి నుంచి ముఖ్య అతిథులుగా బ్రహ్మశ్రీ వెంకటాద్రిస్వామి, వీరకుమారస్వాములు పాల్గొన్నారు. దాతల సహకారంతో మూడు రోజుల పాటు మూడు పూటల అన్నదానం నిర్వహించారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలను గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కట్టా రామ్మోహన్‌రావు కార్యనిర్వాహకుడిగా మహోత్సవాలను విజయవంతంగా జరిపించారు. యువత పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలకు సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రఘురాం, వేణుగోపాల్‌రెడ్డి, కూటమి నేతలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



కొలువుదీరిన వీరబ్రహ్మేంద్రస్వామి మూలవిరాట్



కల్యాణోత్సవంలో స్వామివార్ల ఉత్సవమూర్తులు

## వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని నిరసన



రైల్వేకోడూరు గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

రైల్వేకోడూరు, ఆగస్టు 21: స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ కోల్‌కత్తా ఆర్‌జీ ఆస్పత్రిలో డాక్టర్‌పై అత్యాచారం చేసి ఆపై హత్య చేసిన నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలన్నారు. ఈ కేసులో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. దేశంలో మహిళా కార్మికులు, ఉద్యోగులపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపుల నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు లింగాల యానాదయ్య, అంగన్వాడీ సంఘం నాయకురాళ్లు రమాదేవి, శ్రీలక్ష్మీ, సీపీఎం నాయకుడు మణి పాల్గొన్నారు.

## జడ్పీ హైస్కూల్‌కు మినరల్ వాటర్ అందిస్తాం

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 21: జాండ్రపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మినరల్ వాటర్ అందిస్తామని మండిపల్లె నాగిరెడ్డి ట్రస్టు చైర్మన్ లక్ష్మీప్రసాదురెడ్డి పేర్కొన్నారు. బుధవారం జాండ్రపల్లె హైస్కూల్‌ను సందర్శించి పాఠశాల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా నూతనంగా పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా ఎంపికైన భువనేశ్వరయ్యను అభినందించారు. ఈ సందర్భంగా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు మెనూ ప్రకారం అందించాలని, ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాల సమస్యలు మంత్రి దృష్టికి తీసుకెళ్లి అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రామక్రిష్ణ, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసి నాయకుడు అంకన్న, ఎంపీటీసీ మదన్‌మోహన్, మండల యూత్ ప్రెసిడెంట్ పక్కీరయ్య, ఉమామహేశ్వర్‌రెడ్డి, ఓబులేసు, చలపతి, బాబు, చంద్రశేఖర్, మురళీమోహన్, లోకేశ్వర్‌రెడ్డి, చిన్నయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లె సీఐగా వెంకటకొండారెడ్డి



లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 21: లక్కిరెడ్డిపల్లె సీఐగా వెంకటకొండారెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లా పుట్టపర్తి సర్కిల్ నుంచి బదిలీపై ఇక్కడకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లె సర్కిల్ పరిధిలోని మూడు మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఎర్రచందనం అక్రమ రవాణా, గంజాయి, మాదకద్రవ్యాలు, గ్యాంబ్లింగ్, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టి చట్టపరమైన చర్యలు చేపడతామన్నారు. రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు మండలాల ఎస్‌ఐలు రవీంద్రబాబు, రామక్రిష్ణ, వెంకటసుధాకర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పోటీతత్వంతోనే ప్రతిభకు గుర్తింపు

సంబేపల్లె, ఆగస్టు 21: విద్యార్థులు చిన్ననాటి నుంచి ఇతరులతో పోటీ పడినప్పుడే వారి ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతుల విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రపంచ అట్లాస్ పుస్తకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, శంకరయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సిద్దవటం, ఆగస్టు 21: మండల పరిధిలో 32/11కేవీ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ జయచంద్ర పేర్కొన్నారు. సిద్దవటం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.



# పవన్ రాక సందర్భంగా ముమ్మర ఏర్పాట్లు



సభా ఏర్పాట్లు చేస్తున్న దృశ్యం



ఏర్పాట్లపై పర్యవేక్షిస్తున్న రూపానందరెడ్డి, తదితరులు

రైల్వేకోడూరు, ఆగస్టు 21: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈ నెల 23న రైల్వేకోడూరు మండలంలోని మైసూరివారిపల్లెలో గ్రామ సభకు రానున్న సందర్భంగా బుధవారం జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, మైసూరివారిపల్లె సర్పంచ్ సంయుక్త, జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ జోన్ ఇన్‌చార్జ్‌లు వెంకటేష్, మణి, ఎంపీటీసీ సభ్యులు నాగరాజు, సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌లు పనులు వేగవంతం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన గత రెండు రోజుల నుంచి విద్యుత్ లైన్ల మరమ్మతులు చేశారు. కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లు లాగారు. విద్యుత్ కొరత లేకుండా చేశారు. మండల పరిషత్ అధికారులు, సిబ్బంది మైసూరివారిపల్లె పంచాయతీలో ఎక్కడ పారిశుధ్యం కనిపించకుండా చర్యలు తీసుకున్నారు. అన్ని శాఖల అధికారులు మైసూరివారిపల్లెపైనే దృష్టి పెట్టారు. గ్రామసభ విజయవంతం చేయాలని ఇటు నాయకులు, అటు అధికారులు శ్రమిస్తున్నారు. ఎక్కడా పొరపాటు లేకుండా జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మీ మైసూరివారిపల్లెలోనే మకాం వేశారు. రైల్వేకోడూరు రూరల్ సీఐ పసుపుల వెంకటేశ్వర్లు సభ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవన్ పాల్గొనే సభకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయుడు, చలపతి, చంద్రమోహన్, గుండయ్యనాయుడు, సుబ్బరాయుడు, టీడీపీ యువ నాయకులు నవీన్, హేమరాజ్, భాను తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రికి టీడీపీ నేతల ఘన నివాళి



పసుపులేటి బ్రహ్మయ్య సమాధి వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

రాజంపేట, ఆగస్టు 21: మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య ఐదో వర్ధంతి సందర్భంగా బుధవారం రాజంపేట గీతాంజలి విద్యాసంస్థల ప్రాంగణంలో టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, ప్రభాకర్, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లునాయుడు, మాజీ కౌన్సిలర్ గుగ్గిళ్ల చంద్రమౌళి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ ఎద్దల విజయసాగర్, మన్నూరు టీడీపీ నాయకులు బండారు బాలయ్యలు బ్రహ్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామయ్య, మలిశెట్టి సుబ్బరాయుడు, చల్లా సుధాకర్, జనసేన నాయకులు కత్తి సుబ్బరాయుడు, అబ్బిగారి గోపాల్, శేఖర్, పోలి రవి, దాశరథి, ప్రసాద్ పాల్గొన్నారు.

**ఒంటిమిట్ట:** బ్రహ్మయ్య వర్ధంతిని కుటుంబ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఒంటిమిట్టలోని ఆయన సమాధి వద్ద పూలమాలలు వేసి బ్రహ్మయ్యకు నివాళులర్పించారు. నియోజకవర్గంలో తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చి నియోజకవర్గం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పసుపులేటి శేఖర్, గంగాధర్, రవి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ప్రసాద్‌బాబు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రసాద్‌బాబు, లక్ష్మీప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 21: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యుడు, రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకుడు సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డితో కలిసి క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో జిల్లాను క్రీడాహబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఖాదర్‌వలి, మానవత శాఖ చైర్మన్ శివగంగిరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ డాక్టర్ పి.మదన్‌మోహన్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ శ్రీనివాసరాజు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, రామాంజనేయులు, రవి పాల్గొన్నారు.

## కలిసికట్టుగా ముందుకు సాగుదాం

● టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

నందలూరు, ఆగస్టు 21: అందరం కలిసి ఐక్యతగా ముందుకు సాగుదామని టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పిలుపునిచ్చారు. బుధవారం రాజంపేట టీడీపీ కార్యాలయంలో ఆయనను నందలూరు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రాజు మాట్లాడుతూ ఈ నెల 23న జరిగే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖమంత్రి పవన్‌కళ్యాణ్ పర్యటన విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. సర్పంచ్‌ల సమస్యలను పవన్‌కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లాలని సర్పంచ్ సూర్యనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వక్ఫ్‌బోర్డు మాజీ కార్యదర్శి సయ్యద్ అమీర్, టీడీపీ నాయకులు షేక్ మౌలా, కానకుర్తి వెంకటయ్య, శిరీష, నాగేంద్ర, మట్టిబాబు, శివకుమార్, శివనరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## నీలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

సిద్దవటం, ఆగస్టు 21: మండలంలోని కనుమలోపల్లె వద్ద శ్రావణమాసం సందర్భంగా నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో 108 శివలింగాలకు పూజలు చేశారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు సోమబాబు తెలిపారు.

## పేకాటరాయుళ్లు అరెస్ట్

ఒంటిమిట్ట, ఆగస్టు 22: మండల పరిధిలోని చెరువుకట్ట కింద ఉన్న పొలాల్లో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో ఎస్‌ఐ శివప్రసాద్ సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించారు. ఒంటిమిట్ట సమీపంలోని అరుంధతివాడ కంపచెట్లల్లో నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారన్న సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ దాడిలో ఒంటిమిట్ట గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులతో పాటు, రూ.8040 నగదును స్వాధీనం చేసుకున్నామని, కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

## వాహనాలు తనిఖీ

సిద్దవటం, ఆగస్టు 21: కడప- బద్వేల్ రహదారి ఫారెస్ట్ చెక్‌పోస్టు వద్ద బుధవారం ఎస్‌ఐ చిరంజీవి వాహనాలు తనిఖీ చేపట్టారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు వాహనాలను నడిపేటప్పుడు సంబంధిత పత్రాలను తమవెంట ఉంచుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ చంద్రశేఖర్‌రాజు, స్థానిక పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

రైల్వేకోడూరు, ఆగస్టు 21: ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతిఒక్కరికి అవగాహన ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ యం.భాస్కర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్ వ్యాధిపై రెడ్‌రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారి మహేష్, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ప్రేమలత, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్, ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.సుబ్రహ్మణ్యం, ఓఆర్‌డీ వెంకటేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**వీరబల్లి:** ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాలలో ప్రజాచైతన్య సేవ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు 'ఎయిడ్స్ నివారణ మీకు తెలుసా' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పీసీఎస్‌ఎస్ సిబ్బంది, కళాశాల సిబ్బంది, కళాశాల సిబ్బంది గీత, అంజలి, లక్ష్మణ్, రాజు పాల్గొన్నారు.

## స్త్రీ నిధి రుణాలు సక్రమంగా చెల్లించాలి

● ఏరియా కోఆర్డినేటర్, స్త్రీ నిధి ఏజీఎం

వీరబల్లి, ఆగస్టు 21: స్త్రీనిధి రుణాలు సక్రమంగా చెల్లించాలని ఏరియా కోఆర్డినేటర్, స్త్రీ నిధి ఏజీఎంలు శ్రీనివాసులరెడ్డి, ఉదయ్‌లు పేర్కొన్నారు. ఈ రోజు స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన బకాయిలున్న గ్రామ సమాఖ్యల సిబ్బందిని సమీక్షించారు. గడికోటలోని-2 వీవోలు, ఒంగిమళ్ల గ్రామ సమాఖ్య-2, 5, ఈడిగపల్లి వీవో, గుర్రప్పగారిపల్లె 2, సానిపాయి వీవో-1ల నుంచి సుమారు రూ.20 లక్షల మొండి బకాయిలు ఉన్నందున 4 కోట్లు రుణ సౌకర్యం కోల్పోతున్నారన్నారు. సెప్టెంబరు నెలాఖరుకు బకాయిలు చెల్లించని ఎడల చర్యలు తీసుకొంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం ఖాదర్‌వలి, సీసీలు కృష్ణయ్య, నాగేంద్ర, సుభద్రమ్మ, స్త్రీనిధి మేనేజర్ హరీశ్, వీవోఏలు పాల్గొన్నారు.

## రాజంపేటలో ప్రశాంతంగా బంద్



పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు సభ్యులు

రాజంపేటటౌన్, ఆగస్టు 21: రాజంపేటలో భారత్ బంద్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. ఏపీ ఎస్సీ, ఎస్టీ వర్గీకరణలకు అనుమతి ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ చేపట్టిన బంద్ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్, పలు ప్రభుత్వ పాఠశాలల ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. తెరిచిన ప్రైవేటు పాఠశాలలను మూసివేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కారణంగా దళితుల్లో కొంతమందికే ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, భాస్కర్, మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంజీవ, యల్లయ్య, శాంతయ్య, దేవి, చిరంజీవి, శివయ్య, జయరాం పాల్గొన్నారు.

## సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన

రాయచోటిటౌన్, ఆగస్టు 21: కలకత్తా వైద్య విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం రాయచోటి పట్టణంలోని సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా వైద్య సిబ్బంది రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, అత్యాచార నిందితులను కాపాడాలనుకునే వారికి కఠిన కారాగార శిక్ష విధించాలన్నారు. దేశంలో అన్ని స్థాయిల్లో లైంగిక వేధింపులు, నిరోధక కమిటీలు ఏర్పాటు చేయాలని నినాదాలిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, యూనియన్ లీడర్లు పాల్గొన్నారు.

## సేవలను సద్వినియోగం చేసుకోండి

గాలివీడు, ఆగస్టు 21: అంగన్వాడీ కేంద్రాలు అందిస్తున్న వివిధ రకాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. ఆమె బుధవారం పందికుంట సెక్టార్‌లోని గరుగుపల్లె అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన సామూహిక సీమంతాలు, అన్నప్రాస్తావన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు లక్ష్మి, సోనీ అంగన్వాడీ టీచర్లు తిరుగమ్మా, దిల్షాద్, భూదేవి, సావిత్రి, రాధా తదితరులు పాల్గొన్నారు.

## 'విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వాలి'

పెనగలూరు, ఆగస్టు 21: మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్ ప్రభుత్వం ఉచితంగా ఇప్పించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.బాలసుబ్రమణ్యం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కళాశాల ముఖద్వారం వద్ద సీపీఐ మండల కార్యదర్శి ఆదినారాయణ అధ్యక్షతన విద్యార్థులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఏఐఎస్‌ఎఫ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## మానవత సేవలు అద్వితీయం: ఎస్‌ఐ

సుండుపల్లె, ఆగస్టు 21: మానవత సేవలు అద్వితీయమని ఎస్‌ఐ శ్రీనివాసులు, ఎంఈఓ రవీంద్రనాయక్‌లు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో పలు పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి మానవతా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. మారుమూల మండలాల్లో మానవత సేవలు అందించడం సంతోషదాయకమన్నారు. కష్టాల్లో ఉన్న వారిని ఆదుకున్నప్పుడే సంస్థకు మంచి పేరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మానవత చైర్మన్ గంగిరెడ్డి, అధ్యక్షుడు మహబూబ్‌బాషా, కార్యదర్శి హరికుమార్, టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు భగవాన్ సహాయరెడ్డి, చాంద్‌బాషా, మానవతా సభ్యులు చెంగల్‌రాయుడు, నాగేశ్వరరావు, రవీంద్రారెడ్డి, కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

## రామాలయంలో పూజా కార్యక్రమం

పెనగలూరు, ఆగస్టు 21: మండలంలోని పొందలూరు హరిజనవాడలో గ్రామ ప్రజల విరాళాలతో నూతనంగా నిర్మించిన రామాలయంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథ్‌నాయుడు పాల్గొన్నారు. ఆయన వెంట ఏపీఎంసీ మాజీ చైర్మన్ విశ్వేశ్వరనాయుడు, అన్నమయ్య జిల్లా రైతు టీడీపీ అధ్యక్షుడు కృష్ణయ్యనాయుడు, అనంతపురం టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జయరామయ్యనాయుడు, వెంకటసుబ్బయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ఆక్రమణలు పరిశీలన

నందలూరు, ఆగస్టు 21: మండల కేంద్రంలోని నందలూరు బస్టాండ్ నుంచి రాజంపేట వైపు వెళ్లే ప్రధాన రహదారిలోని రోడ్డు ఆక్రమణలను తహసీల్దారు అమర్‌నాథ్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు బుధవారం పరిశీలించారు. ఈ ఆక్రమణలను పరిశీలించేందుకు గురువారం హైవే అధికారులు కూడా రానున్నట్లు సమాచారం. ఆర్‌ఐ సుశీల్, మండల సర్వేయర్ ఓబయ్య, పంచాయతీ సెక్రటరి శ్రీనివాసులు, వీఆర్వోలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ఆర్థికాభివృద్ధికే తపాల సేవలు : డీఎస్

సుండుపల్లి, ఆగస్టు 21: ప్రజల ఆర్థికాభివృద్ధికి తపాల సేవలు ఎంతో దోహదపడతాయని డివిజనల్ సూపరింటెండెంట్ రాజేష్‌కుమార్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం సభాభవనంలో తపాల వినియోగదారులు, ప్రజలు, తపాలశాఖ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతం నుంచి తపాల సేవలను మరింత బలోపేతం చేయాలన్నారు. ఆడబిడ్డల కోసం 2015 సంవత్సరంలో భారత ప్రధాని అధిక వడ్డీతో పొదుపు వచ్చేలా సుకన్య సంవృద్ధి యోజన పథకాన్ని తీసుకువచ్చారని, ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రామచంద్ర, జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్మాస్టర్ జయన్న, రాయచోటి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ బంద్ ప్రశాంతం

నందలూరు, ఆగస్టు 21: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును నిరసిస్తూ రిజర్వేషన్ బచావో సంఘం సమితి పిలుపు మేరకు నందలూరులో భారత్ బంద్‌ను దళితవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో ర్యాలీలు, నిరసనల మధ్య శాంతియుతంగా నిర్వహించారు. బస్టాండ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నిరసన తెలిపారు. అనంతరం స్థానిక బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మోడపోతుల రాము, సూర్యనారాయణ, పెనుబాల నాగసుబ్బయ్య, కాకి చంద్ర, మోడపోతుల సుధాకర్, ఎముక దుర్గయ్య, సురేష్, తుమ్మది శివకుమార్, బలరాం, శివనరసింహులు పాల్గొన్నారు.

## గ్రామ సభలను విజయవంతం చేయండి

సుండుపల్లె, ఆగస్టు 21: అన్ని గ్రామ పంచాయతీల్లో ఈ నెల 23న జరిగే గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బంది, మండల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు.

## గో సంరక్షణ ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం



విరాళం పత్రాన్ని అందిస్తున్న ఇన్‌చార్జి ఈవో వాణి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 21: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయ గోసంరక్షణ ట్రస్టుకు బెంగళూరుకు చెందిన లక్ష్మీసంతోష్ బుధవారం రూ.5లక్షలు విరాళంగా అందించారు. తల్లిదండ్రులు మహేశ్వరి, మురళీకృష్ణ పేరున దాత విరాళాన్ని అందించారు. ఇన్‌చార్జి ఈవో వాణి ఆయన్ను స్వాగతించి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు వాసు, కోదండ పాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

## జెన్‌ప్యాక్ట్‌లో 1,500 ఉద్యోగాలు : కలెక్టర్

తిరుపతి(విద్య), ఆగస్టు 21: ప్రముఖ ఐటీ కంపెనీ జెన్‌ప్యాక్ట్‌లో 1,500 ఉద్యోగాలకు బీటెక్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. ఈ ఉద్యోగాల భర్తీ కోసం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కంపెనీ ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ కంటెంట్ మోడరైజేషన్, కస్టమర్ సర్వీస్ - వాయిస్ సపోర్ట్ విభాగాల్లో 1,500 ఉద్యోగాలు ఉన్నట్టు వివరించారు. ఏదేని గ్రూప్‌లో బీటెక్ లేదా ఏదేని డిగ్రీ 2022, 2023, 2024 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఉద్యోగం హైదరాబాద్‌లో కల్పిస్తారని తెలిపారు. ముందుగా జ్ఞ్టిఇటు//ఞ్జ్.జ్ఞూఢ46గ్ణి6 లింక్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈనెల 28వ తేదీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ. రిజిస్ట్రేషన్ పూర్తిచేసుకున్న అభ్యర్థుల అర్హతను పరిశీలించి వారిని ఇంటర్వ్యూకు అనుమతిస్తారు. ఎప్పుడు ఎక్కడ ఇంటర్వ్యూ జరుగుతుందనే వివరాలను రిజిస్ట్రేషన్ తర్వాత తెలియజేస్తారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి లోకనాథం తెలిపారు. ఇతర వివరాలకు 99888 53335లో సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో ఏడీఎస్డీ మురళీకృష్ణ, డీపీవో గణేష్, కోఆర్డినేటర్లు దిలీప్, మహేష్ పాల్గొన్నారు.

## శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.46 కోట్లు

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.46 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి, బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 73,082 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 27,972 మంది తలనీలాలు సమర్పించారు.

## ఎస్వీ పాలిటెక్నిక్ స్కిల్‌హబ్‌లో... నైపుణ్యాలపై ఉచిత శిక్షణ, ఉపాధి కల్పన

తిరుపతి(విద్య), ఆగస్టు 21: వివిధ కంపెనీలకు కావలసిన విధంగా నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇచ్చి... ఉపాధి కల్పించనున్నట్లు తిరుపతి ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ వై.ద్వారకానాథరెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0 పథకంద్వారా జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో ఈ శిక్షణా కార్యక్రమాలు ఉంటాయని ఆయన వివరించారు. ఉచితంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగావకాశం కల్పిస్తారు. రోజులో 4 గంటలు మాత్రమే స్కిల్ హబ్‌లో శిక్షణా తరగతులు ఉంటాయి. 15 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల వయసు లోపలివారు మాత్రమే శిక్షణకు అర్హులు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఎన్ఎస్‌డీసీ జారీచేసే ఎన్‌సీవీఈటీ సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

### కోర్సుల వివరాలు

జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, ఫీల్డ్ టెక్నీషియన్ నెట్‌వర్కింగ్ అండ్ స్టోరేజ్ కోర్సుల్లో శిక్షణ ఉంటుంది. 10వ తరగతి, ఆపైన ఉత్తీర్ణులైనవారు ఈ శిక్షణలో చేరేందుకు అర్హులు. రెండు కోర్సులకు మొత్తం 210 గంటల శిక్షణ ఉంటుంది. ఆసక్తి కలిగిన యువతీ యువకులు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. 72073 89948, 90009 57055 నెంబర్లలో సంప్రదించి అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. నేరుగా కలవాలనుకునేవారు తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో సంప్రదించవచ్చు.

## శ్రీగంధం స్వాధీనం - 9మంది అరెస్టు

ఎర్రావారిపాలెం, ఆగస్టు 21: శ్రీగంధాన్ని స్మగ్లింగ్ చేస్తున్న ముఠాను ఎర్రావారిపాలెం పోలీసులు వల పన్ని పట్టుకొన్నారు. పోలీసుల కథనం మేరకు వివరాలు... మండలం నుంచి శ్రీగంధం అక్రమ రవాణా జరుగుతోందనే సమాచారంతో ఎర్రావారిపాలెం - రొంపిచెర్ల రోడ్డు జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద బుధవారం పోలీసులు నిఘా వేశారు. ఈక్రమంలో ప్రయాణికులతో వేగంగా వస్తున్న ఆటోను ఆపి పరిశీలించగా, రెండు మూటలు ఉన్నాయి. వాటిని విప్పి పరిశీలించగా శ్రీగంధం ఉన్నట్లు గుర్తించారు. శ్రీగంధాన్ని స్మగ్లింగ్ చేస్తున్న సుక్కలపాటి రమేష్, ఇరువారం మోహన్, ఆవులమడుగు రమేష్, గుండ్రాతికుప్పం చంద్రయ్య, సుక్కలపాటి లక్ష్మయ్య, కనికరం నాగరాజ, సుక్కలపాటి రాజేశ్వరి, ఆవులమడుగు కవిత, వై.గౌరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## అమ్మవారి సేవలో వైవీబీ రాజేంద్రప్రసాద్



తిరుచానూరు, ఆగస్టు 21: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని బుధవారం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు వైవీబీ రాజేంద్రప్రసాద్ దర్శించుకున్నారు. వేదపండితులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. ఆయనతో పాటు రాష్ట్రప్రధాన కార్యదర్శి బీరు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షులు సింగంశెట్టి సుబ్బరామయ్య, కొత్తపు మునిరెడ్డి, ఉమ్మడి చిత్తూరుజిల్లా పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు చుక్కా ధనుంజయ్‌యాదవ్, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కుప్పాల మురళి తదితరులున్నారు.

## ఈ-క్రాప్ నమోదులో వివరాలు పక్కాగా ఉండాలి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 21: ఈ క్రాప్ నమోదులో పంటలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 1,11,727 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయ్యిందన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిందు, తుంపర్ల సేద్య పరికరాల పంపిణీకి సంబంధించి రైతుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుత ఏడాది 21వేల హెక్టార్లు లక్ష్యంగా నిర్ణయించగా, ఇప్పటివరకు 10వేల హెక్టార్లకు 9,169 మంది రైతుల రిజిస్ట్రేషన్లు జరిగాయన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశి, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, శోభారాణి, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

### పెండింగ్ ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు

జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మంజూరైన ఇళ్లలో స్టేజ్ కన్వర్షన్ జరిపి పూర్తి చేయాలని గృహ నిర్మాణ అధికారులు, ఎంపీడీవోలను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో పీఎం ఆవాస్ యోజన ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేందుకు అవసరమైన ఆర్థిక సహాయాన్ని సంఘాల ద్వారా లబ్ధిదారులకు అందజేయాలని సూచించారు. ఎంపీడీవోలు, హౌసింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, లబ్ధిదారులకు సహకరించాలని కోరారు.

## విస్తరణ దిశగా విమానాశ్రయం

### మరిన్ని నగరాలకు విమానాలు

### అంతర్జాతీయ సర్వీసులకోసం రన్‌వే విస్తరణ పనులు పూర్తి



ఏటీసీ బిల్డింగ్ నిర్మాణం



విమానాశ్రయ డైరెక్టర్ శ్రీనివాసరావు

రేణిగుంట, ఆగస్టు 21: తిరుపతి విమానాశ్రయం నుంచి దేశంలోని పలు నగరాలకు విమాన సర్వీసులు త్వరలో విస్తరించనున్నాయి. రేణిగుంటలోని విమానాశ్రయం నుంచి వారంలో నాలుగు రోజులు 14, మిగిలిన 3 రోజులు 13 విమాన సర్వీసులు విశాఖపట్టణం, హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు, బెల్గామ్, ఢిల్లీ నగరాల నుంచి నడుస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఇక్కడినుంచి ముంబై, అహ్మదాబాద్, కోల్‌కత్తా, అలహాబాద్, మధురై, తిరుచ్చి, తిరువనంతపురం విమానాశ్రయాల నుంచి సర్వీసులు నడిపేందుకు ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనల పట్ల సానుకూలంగా స్పందించిన పలు విమాన సంస్థలు తిరుపతికి విమాన సర్వీసులు పెంచనున్నాయి. అయితే ఈ సర్వీసులు తిరుపతికి నేరుగా కాకుండా కనెక్టింగ్ విమానాల ద్వారా నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. భవిష్యత్తులో ఈ సర్వీసుల ద్వారా ప్రయాణికులు పెరిగితే ఆయా నగరాల నంచి తిరుపతి విమానాశ్రయానికి నేరుగా సర్వీసులు నడిపేందుకు అవకాశం ఉంటుంది.ఈ విషయంపై ఎయిర్‌పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావును అడగ్గా దేశంలోని పలు ప్రధాన నగరాల నుంచి తిరుపతి విమానాశ్రయానికి సర్వీసులు నడిపేందుకు కొన్ని సంస్థలు ముందుకు వస్తున్నాయన్నారు. ఇప్పటికే అంతర్జాతీయ విమానాలు ల్యాండయ్యేందుకు రన్‌వే పనులు పూర్తయ్యాయని,ఢిల్లీలో వున్న డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) పరిశీలించి అనుమతులు ఇవ్వడం కూడా జరిగిందన్నారు.రన్ వే మరింత విస్తరణ కోసం, ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లకు 11.11 ఎకరాలు అవసరం ఉండగా రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా సానుకూలంగా స్పందించిందన్నారు. త్వరలో భూమిని సర్వే చేసి విమానాశ్రయానికి అందజేయనున్నారని తెలిపారు. అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో ఏటీసీ బిల్డింగ్ పనులు రూ.47కోట్ల వ్యయంతో జరుగుతున్నాయని, గతంలో ఉన్న టవర్ కన్నా అధికంగా 18 మీటర్లు వెడల్పు కలిగిన ఏటీసీ టవర్‌ను నిర్మిస్తున్నామన్నారు.

## భక్తుల ఆరోగ్య భద్రత టీటీడీ ప్రథమ కర్తవ్యం

### టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి



ఫుడ్ సేఫ్టీపై శిక్షణ ఇస్తున్న ఆంజనేయులు

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు సరసమైన ధరలకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్య భద్రతే టీటీడీకి అత్యంత ప్రాధాన్యత అని అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నారు. టీటీడీ ఆరోగ్య విభాగం, ఆహార భద్రత విభాగాలతో కలిసి తిరుమలలోని హోటళ్ల నిర్వాహకులు, యజమానులకు తిరుమలలోని శ్రీవారిసేవాసదన్‌లో బుధవారం జరిగిన శిక్షణా కార్యక్రమంలో అదనపు ఈవో పాల్గొని మాట్లాడారు. హోటళ్లలో అన్ని రకాల తినుబండారాలను ఫుడ్ సేఫ్టీ నిర్దేశించిన ప్రమాణాల మేరకే తయారు చేయాలని చెప్పారు. న్యూఢిల్లీకి చెందిన ఎఫ్ఎస్ఎస్ఏఐ సర్టిఫైడ్ ట్రైనర్ ఆంజనేయులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫుడ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో అన్ని రెస్టారెంట్లు, తినుబండారాలలో అనుసరించాల్సిన పరిశుభ్రత, పారిశుధ్య పద్ధతులు, ఆహారం చెడిపోవడం వల్ల కలిగే భౌతిక-రసాయన-జీవ ప్రమాదాలు, వృధా వంటి వాటి గురించి వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే తీసుకునే చర్యల గురించి తెలియజేశారు. టీటీడీ ఆరోగ్య శాఖ డిప్యూటీఈవో ఆశాజ్యోతి మాట్లాడుతూ.. ఇక నుంచి ప్రతి మూడు నెలలకొకసారి తిరుమలలో హోటళ్ల వ్యాపారులందరికీ ఈశిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈకార్యక్రమంలో హెల్త్‌ఆఫీసర్ మధుసూదన్‌రావు, జిల్లా ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వరరావు, తిరుమల ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జగదీష్, తిరుమలలోని హోటళ్ల వ్యాపారులు, టీటీడీ అన్నప్రసాదం సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమలలో అనధికార నివాసాల తొలగింపు



షెడ్లను తొలగిస్తున్న పొక్లెయినర్

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఉన్న అనధికార నివాసాలను టీటీడీ గురువారం తొలగించింది. తిరుమల భద్రత దృష్ట్యా ఇటీవల విజిలెన్స్, పోలీసు అధికారులు తిరుమలలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక దాడులు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి గుర్తింపు లేని వ్యక్తులను గుర్తించడంతో పాటు నిషేధిత వస్తువులు ఏమైనా ఉన్నాయా అనే అంశంపై తనిఖీలు చేశారు. కాగా, గతంలో భవన నిర్మాణం కోసం వచ్చిన కార్మికులు తమ పనులు పూర్తయినప్పటికీ ఇంకా తిరుమలలోనే ఉన్నట్టు గుర్తించారు. బాలాజీనగర్‌కు సమీపంలోని పాచికాల్వ గంగమ్మ ఆలయానికి సమీపంలో 70పైగా ఉన్న షెడ్లలో నివాసముంటున్నట్టు గుర్తించారు. ఈక్రమంలో కొంతమంది అనధికార వ్యక్తులను తిరుమల నుంచి పంపేశారు. మరికొంతమంది నుంచి వివరాలను సేకరించారు. కాగా, భవన కార్మికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లను బుధవారం సాయంత్రం పొక్లెయినర్‌తో తొలగించారు.

## మీరు లాకర్ తీసుకుని ఏడాది అవుతోంది!

### ఫైన్ కట్టండి లేకుంటే ఆధార్ బ్లాక్ చేస్తాం

### భక్తులను బెదిరించి దోచుకుంటున్న యువకుడు

### టీటీడీ విజిలెన్స్ విచారణలో వెలుగులోకి

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో సరికొత్త అక్రమం వెలుగు చూసింది. 'మీరు లాకర్ తీసుకుని దాదాపు ఏడాది అవుతోంది. మీరు ఖాళీ చేయకపోవడం వల్ల ఫైన్ పడింది. కట్టకుంటే మీ ఆధార్ కార్డును బ్లాక్ చేస్తాం' అంటూ ఓ యువకుడు శ్రీవారి భక్తులను బెదిరిస్తూ అందినకాడికి దోచుకుంటున్నాడు. తిరుమలలో బస చేసేందుకు గదులతో పాటు యాత్రికుల వసతి సముదాయాల్లో లాకర్లు అందుబాటులో ఉన్న విషయం తెలిసిందే.గదులు లభించని చాలామంది భక్తులు ఈ లాకర్లపైనే ఆధారపడుతుంటారు. లాకర్లలో లగేజీని భద్రపరుచుకుని దర్శనమయ్యాక తీసుకుని వెళ్లిపోతుంటారు. లాకర్ పొందే సమయంలో భక్తులు తమ వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.ఇటీవల ఓ యువకుడు కొంతమంది భక్తులకు ఫోన్ చేసి వారు తిరుమలకు వచ్చిన తేదీ, లాకర్ తీసుకున్న ప్రాంతం, ఆధార్, సెల్‌నెంబరు చెబుతున్నాడు.ఇప్పటివరకు లాకర్ ఖాళీ చేయకపోవడంతో తమ ఆడిట్‌లో ఫైన్ పడిందని, ఆ సొమ్ము కట్టకపోతే ఇకపై దర్శనాలు, గదులు, లాకర్లు తీసుకునే వీల్లేకుండా ఆధార్ కార్డును బ్లాక్ చేస్తామని బెదిరిస్తున్నాడు.ఆధార్ బ్లాక్ అయిపోతే ఇబ్బంది పడతామన్న కొంతమంది భక్తులు ఆ యువకుడు డిమాండ్ చేసిన డబ్బును చెల్లించినట్టు తెలిసింది. ఇటీవల ఓ భక్తురాలికి ఫోన్ చేసి ఫైన్ కట్టాలని డిమాండ్ చేయడంతో ఆమె నగదు చెల్లించింది.ఆ పరిచయంతో తనకు దర్శనం కావాలని కోరగా చేయిస్తానని నమ్మించిన ఆ యువకుడు నగదు తీసుకుని తర్వాత చేతులెత్తేశాడు. దీంతో ఆ భక్తురాలు విజిలెన్స్‌ను ఆశ్రయించగా విచారణలో ఈ అక్రమం వెలుగు చూసింది. ఆ యువకుడు బెంగళూరులో ఉన్నట్టు గ్రహించిన టీటీడీ అధికారులు అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే ఆ భక్తుల వివరాలు అతడి వద్దకు ఎలా చేరాయనేది ప్రశ్నార్థకంగా మారింది.

## తిరుమలలో మెగాస్టార్



సినీ హీరో చిరంజీవి బుధవారం సాయంత్రం తిరుమలకు వచ్చారు.గురువారం తన పుట్టినరోజు సందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం అమ్మ అంజనాదేవి, భార్య సురేఖ, కుమార్తె శ్రీజ, మనవరాలు నవిష్కలతో కలిసి కొండ పైకి చేరుకున్నారు.

## 24, 25 తేదీల్లో అండర్ 14 క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(క్రీడలు), ఆగస్టు 21: ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 24, 25వ తేదీల్లో అండర్ 14 బాయ్స్ క్రికెట్ సెలక్షన్స్ నిర్వహించనున్నట్లు సీడీసీఏ సంఘం అధ్యక్షుడు బి.విజయ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 01-09-2010 తర్వాత జన్మించిన యువకులు అర్హులని, క్రీడాదుస్తులు, కిట్, ఆధార్, జనన ధ్రువీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. యువ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 90002 14966, 88861 85559 నెంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. వేదిక వివరాలిలా... పుత్తూరులోని ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీకళాశాల, శ్రీకాళహస్తిలోని కేసీసీ క్రికెట్‌నెట్స్, పీలేరులోని పియోక్ క్రికెట్ అకాడమి, భువనవిద్యానిలయం, వాల్మీకిపురంలోని జీవీఎస్‌సీఎస్ క్రికెట్ మైదానం, తిరుపతిలోని సీవీ క్రికెట్ అకాడమి, చిత్తూరులోని పోలీసుగ్రౌండ్, పలమనేరులోని ప్రభుత్వ డిగ్రీకళాశాల, వి.కోటలోని జీఎంఆర్ క్రికెట్ అకాడమిలలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు.



## నీటి వినియోగంపై టీటీడీ ఆంక్షలు

### తిరుమలలో ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు

### హోటళ్లకు ఇకపై ఎనిమిది గంటలే సరఫరా

### అదనంగా కావాలంటే తిరుపతి నుంచి తెచ్చుకోవచ్చు



మూడు కొళాయిల్లో ఒకటి బంద్



బాలాజీనగర్

తిరుమల, ఆగస్టు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నీటి వినియోగంపై టీటీడీ ఆంక్షలు విధించింది. భవిష్యత్తులో నీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు, భక్తులకు నీటి కొరత ఏర్పడకుండా చూసేందుకు హోటళ్లకు, మఠాలకు, స్థానికులకు ఇకపై నీటి సరఫరా నిరంతరం ఉండదంటూ ఉత్తర్వులు జారీ చేసింది. తిరుమల అవసరాలకు రోజూ దాదాపు 40 లక్షల గ్యాలన్ల నీరు అవసరం. ఈ నీటిని పాపవినాశనం, కుమారధార, పసుపుధార, గోగర్భం, ఆకాశగంగ డ్యాముల నుంచి తీసుకుని శుద్ధి అనంతరం సరఫరా చేస్తుంటారు. 14,304 లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం ఉన్న ఈ డ్యాముల్లో ప్రస్తుతం నీళ్ల సగానికి పైగానే ఉన్నాయి. అయితే వర్షాలు తక్కువగా పడడం, రాబోయే రోజుల్లో వర్షాలు కురిసే అవకాశాలు తక్కువగా ఉన్నాయనే అంచనా వేసిన టీటీడీ ప్రస్తుతం ఉన్న నీటిని పొదుపుగా వాడుకోవాలని భావిస్తోంది.ఏడెనిమిదేళ్ల క్రితం అమలు చేసిన నీటిపొదుపు చర్యలను పరిశీలించి వాటినే పాటించాలని భావించి నీటి నియంత్రణ నిబంధనలను ఈ నెల మొదటివారంలో ఇంజినీరింగ్ వాటర్‌వర్క్స్ విభాగం విడుదల చేసింది.తిరుమలలోని హోటళ్లు, జనతా క్యాంటీన్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లకు టీటీడీ వాటర్‌వర్క్స్ విభాగం 24 గంటల పాటు నీటిని సరఫరా చేస్తోంది. ఈనెల 25వ తేదీ నుంచి ఉదయం 6 నుంచి 10 గంటలకు, మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 7 గంటల వరకు మొత్తం ఎనిమిది గంటల పాటు మాత్రమే నీటిని సరఫరా చేయనున్నట్లు నోటీసులను హోటళ్ల నిర్వాహకులకు అందజేసింది.అదనపు నీరు కావాలంటే విజిలెన్స్ అనుమతితో తిరుపతి నుంచి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా తెచ్చుకోవచ్చని సూచించింది.మఠాలకు కూడా ఇదే తరహాలో ఆంక్షలు విధించారు. తిరుమలలోని అన్నప్రసాదభవనం, ముఖ్యప్రాంతాల్లోని నీటి కుళాయి కేంద్రాలు, కాటేజీల్లో నీటి వినియోగాన్ని తగ్గించే ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జలప్రసాదాల్లో కొన్ని నీటి కుళాయిలను మూసివేశారు. నాలుగు కుళాయిలున్న చోట రెండు, ఐదు కుళాయిలున్న చోట మూడింటికి కుదించారు.పలు ప్రాంతాల్లో జరుగుతున్న కాటేజీల నిర్మాణానికి సంబంధించిన కాంట్రాక్టర్లకు కూడా నిబంధనలు పెట్టారు.తిరుపతి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చుకోమని సూచించారు.

### బాలాజీనగర్‌కు ఆరు రోజులకోసారి

నీటిపొదుపులో భాగంగా తిరుమలలో స్థానికులు నివసించే బాలాజీనగర్‌కు ఆరు రోజులకోసారి మాత్రమే నీటిని విడుదల చేస్తామని టీటీడీ ప్రకటించడంతో స్థానికుల్లో భయం మొదలైంది.ఇక్కడ మొత్తం 1,060 ఇళ్లు ఉండగా దాదాపు 10 వేలమంది నివాసముంటున్నారు. ఆరు రోజులకోసారి నీళ్ల విడుదల చేస్తే వంటకు కూడా ఇబ్బందిపడాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.మూడురోజులకు ఓసారైనా నీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.

### 4 నెలలకు మాత్రమే నీళ్లున్నాయ్: టీటీడీ

తిరుమలలో నీటి అవసరాలను తీర్చడానికి ఐదు ప్రధాన డ్యాముల్లో ప్రస్తుతమున్న నీరు 120 నుంచి 130 రోజులు మాత్రమే సరిపోతాయని టీటీడీ బుధవారం ఓ ప్రకటన ద్వారా తెలిపింది. తిరుమలలోని డ్యాముల్లో 5,800 లక్షల గ్యాలన్ల నీరు మాత్రమే అందుబాటులో ఉందని, రానున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా నీటి వినియోగాన్ని నియంత్రించేందుకు కొన్ని చర్యలు తీసుకుంటున్నట్లు టీటీడీ పేర్కొంది.

## గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వాల్మీకిపురం, ఆగస్టు 21: వాల్మీకిపురం పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమా అమరేశ్వరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో బోటనీ, ఎంఎల్‌టీ, జీఎఫ్‌సీ పోస్టులకు అర్హులైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్‌లతో 23వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు కళాశాలలో సంప్రదించాలని తెలియజేశారు.

## పీహెచ్‌సీ నిధుల వినియోగంపై వాగ్వాదం

రామసముద్రం, ఆగస్టు 21: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిధుల వినియోగంపై బుధవారం మెడికల్ ఆఫీసర్ లీలావతి, యూడీసీ లక్ష్మీనారాయణ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఏడాది మంజూరైన నిధుల వినియోగంపై చర్చించడానికి ఎంపీపీ కుసుమ కుమారి అధ్యక్షతన బుధవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ యూడీసీ నిర్లక్ష్యంతోనే ఆసుపత్రి అభివృద్ధి నిధులు వెనక్కు వెళ్లాయని ఆరోపించారు. అయితే నాడు నేడు పనుల కింద నిధులు వచ్చిన నిధులు వినియోగించేందుకు ఉన్నతాధికారుల నుండి అనుమతి రాకపోవడంతో వినియోగించలేదని యూడీసీ తెలిపారు. దీంతో వాగ్వాదం చోటు చేసుకోగా లక్ష్మీనారాయణ అర్ధాంతరంగా సమావేశం నుంచి వెళ్లిపోయాడు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దమండ్యం, ఆగస్టు 21: ప్రజా సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని జనసేన పార్టీ నాయకులు తెలిపారు. పెద్దమండ్యంలో బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పర్యటించి, అభివృద్ధి పనుల జాబితా తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఉపాధి పనుల వివరాలను కూలీలకు తెలియజేయాలన్నారు. తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీవో మురళితో మాట్లాడారు. అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల జనసేన ఉపాధ్యక్షుడు భీమయ్య నేతలు శ్రీనివాసులు, రామకృష్ణ, కిరణ్‌కుమార్, రఘుపతి, రవికుమార్, చెన్నకేశవ, చరణ్, శ్రీనివాసులు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చిమొక్కల తొలగింపు

తంబళ్లపల్లె, ఆగస్టు 21: తంబళ్లపల్లె ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ వెంబడి పెరిగిన పిచ్చిమొక్కలను ఎస్ఎంసీ చైర్మన్ సుగవాసి శివకుమార్ ఎక్స్‌కవేటర్ సాయంతో తొలగించారు. ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు పాఠశాల ప్రహరీ గోడ వెంబడి చెత్తాచెదారం ఏర్పడి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. వీటిలో విషసర్పాలు చేరడంతో పాటు దోమలు వ్యాప్తి చెందుతాయన్న ఉద్దేశంతో పాఠశాల చైర్మన్ శివకుమార్ చర్యలు తీసుకున్నారు. దీనిపై పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉన్నత స్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలి

పీలేరు, ఆగస్టు 21: ఆటోడ్రైవర్లు ఉన్నతస్థాయికి ఎదిగేందుకు కృషి చేయాలని పీలేరు ఎస్ఐ బాలకృష్ణ సూచించారు. బుధవారం పీలేరులో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య ఆటో డ్రైవర్ల యూనియన్ కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన లేమి కారణంగా ఆటో డ్రైవర్ల జీవితాల్లో అభివృద్ధి లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న కార్మిక పథకాలను సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధి సాధించ వచ్చునన్నారు. ఏపీ ట్రాన్స్‌కో నాయకుడు మురళీధర్ మాట్లాడుతూ చెన్నైలోని ఆటో డ్రైవర్ అన్నాదొరైను ఆదర్శంగా తీసుకుని ఆటో డ్రైవర్లు జీవితంలో ముందుకు సాగాలన్నారు. ఐఎన్‌టీయూసీ నేత ఎల్.రత్నకుమార్ మాట్లాడుతూ నిబంధనలను పాటిస్తే ఆటో డ్రైవర్లకు ఎటు వంటి సమస్యలు ఉత్పన్నం కావన్నారు. అనంతరం మూడు జిల్లాల అధ్యక్షుడిగా పీలేరుకు చెందిన బిస్మిల్లా ఆటో యూనియన్ అధ్యక్షుడు బోడేషావలిని ఎన్నుకున్నారు. బోడేషావలిని ఆటో డ్రైవర్లు ఘనంగా సన్మానించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు హుమయూన్, చిరం జీవి, బబ్జాన్, గిరిజన సంక్షేమ సంఘం నాయకురాలు సోనా బాయి, తదితరులు పాల్గొన్నారు.

## మూడు చోట్ల చోరీలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు21: మండలంలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం చోరీలు జరిగాయి. సీటీఎం రోడ్డులోని దేవతనగర్, వివేకానంద నగర్‌లోని నజీర్, రహీం ఇళ్లకు తాళం వేసుకుని ఊర్లకు వెళ్లగా, దొంగలు తాళాలు పగులగొట్టి బీరువాల్లో ఉన్న బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. ఇందిరానగర్‌లోని టీస్టాల్‌లో షట్టర్ తాళాలు పగల గొట్టి క్యాష్ డ్రాలో ఉన్న నగదును తస్కరించారు. బుధవారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## 'డయల్ యువర్ డీఎం'కు 4 వినతులు

మదనపల్లె అర్బన్ ఆగస్టు 21:మదనపల్లె ఆర్టీసీ వన్ అండ్ టూ డిపోల పరిధిలో బుధవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి నాలుగు వినతులు అందాయని డీఎం వెంకటరమణారెడ్డి తెలిపారు. బి.కొత్తకోటనుంచి స్టేట్‌బార్డర్‌కు అదనపు ట్రిప్పులు తిప్పాలని కోరగా, ఈపీకే తక్కువగా ఉన్న కారణంగా ఆ అవకాశం లేదని డీఎం సమాధానమిచ్చారు. వాయల్పాడు మీదగా గుర్రంకొండకు షటిల్ సర్వీసులు పెంచాలన్న అభ్యర్థనలకు డీఎం అంగీకరించారు. రామసముద్రంకు అదనపు సర్వీసులు వేయాలన్న అభ్యర్థనకు సర్వీసులు పెంచడానికి ఆర్టీసీ ఉన్నతాధికారులు అనుమతి కోరామన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, సిబ్బంది రవి, తదితరులు పాల్గొన్నారు.

## ములకలచెరువు సీఐగా రాజారమేష్

ములకలచెరువు, ఆగస్టు 21: ములకలచెరువు సీఐగా రాజారమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మధు వీఆర్‌కు వెళ్లడంతో ఆయన స్థానంలో సత్యసాయి జిల్లా కొత్తచెరువు సీఐగా పనిచేస్తున్న రాజా రమేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు.

# బంద్ ప్రశాంతం.. నామమాత్రం!



రామసముద్రంలో ధర్నా చేస్తున్న మాలమహానాడు నేతలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 21: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పును నిరసిస్తూ మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం ఆధ్వర్యంలో పట్టణంలో బంద్, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ తీర్పు వెనుకబడిన వర్గాల్లో చిచ్చు పెట్టిందన్నారు. రాజకీయ లబ్ధి కోసం మోడీ చట్టాలను నాశనం చేస్తున్నట్లు ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు అమలు నిలుపుదల చేసేంత వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాయలసీమ కన్వీనర్ యమలా చంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గుండా మనోహర్, జిల్లా అధికారప్రతినిధి మోహన్, లక్ష్మీపతి, గ్యాస్ చంద్ర, మోహన, రమణ, రామకృష్ణ, రామచంద్ర, కృష్ణప్ప, రామ చంద్ర, తిప్పయ్య, చంద్రయ్య పాల్గొన్నారు. కాగా, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, దుకాణాలు మామూలుగానే తెరుచుకోవడంతో భారత్ బంద్ ప్రభావం కన్పించలేదు.

**నిమ్మనపల్లి:** స్థానిక బస్టాండు కూడలిలో మాలమహానాడు మండల అధ్యక్షుడు మాణిక్యం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకే అధికారాలు కల్పించడం సమంజసం కాదన్నారు. తక్షణమే వర్గీకరణను ఆపివేయాలని లేని పక్షంలో ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్, సహదేవ, జయన్న, జగదీష్, వెంకటరమణ, సూర్యప్రకాష్, రెడ్డెప్ప, రాంబాబు పాల్గొన్నారు.

**వాల్మీకిపురం:** మండల కేంద్రంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య, జిల్లా అధ్యక్షుడు శివయ్య, ఉపాధ్యక్షుడు వెంకట స్వామి ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, దుకాణాలు మూయించారు. జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు, భూమా దేవేంద్ర, నాని, ప్రవీణ్, అశోక్, చిన్నసూరి, సుబ్రహ్మణ్యం, శ్రీను, నరేంద్ర, రమణ, రాజన్న, భాస్కర్, ఇరగప్ప, కృష్ణయ్య, నాగయ్య, రమణయ్య, శేఖర్, శ్రీను, తిమ్మయ్య, రామ్‌దాస్, రవి, చంద్ర, రాజన్న, పాపయ్య, కృష్ణప్ప పాల్గొన్నారు.

**రామసముద్రం:** మాలమహానాడు అధ్యక్షుడు కృష్ణప్ప ఆధ్వర్యంలో పాఠశాలలు, దుకాణాలు మూసి వేశారు. బస్సులు నడవలేదు. మాల మహానాడు నాయకులు రహదారిపై ధర్నా చేశారు. అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, కృష్ణప్ప, శివశంకర్, నారాయణస్వామి, మెకానిక్ వెంకటేష్, శివ, రమణప్ప, శేషాద్రి, నరసింహులు, పవన్, జైరాజు, బాలాజి, అరికెల రామాంజులు, మల్లి, నరసింహులు, శివ, హరి, సోము, నారాయణ మాలమహానాడు సభ్యులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు పేదలకు అందించడమే లక్ష్యం

● ఎమ్మెల్యే నల్లారి కిశోర్



నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, ఆగస్టు 21: ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూడటమే లక్ష్యమని ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన చర్చించారు. టీడీపీ గెలుపు కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకూ సముచిత స్థానం ఉంటుందన్నారు. తాను నిరంతరం అందుబాటులో ఉంటానని, ఏ సమస్య వచ్చినా ప్రజలు నేరుగా వచ్చి తనను కలవచ్చన్నారు. నాయకులు, కార్యకర్తలు పగ, ప్రతీకారా లకు చోటు లేకుండా నడచుకోవాలన్నారు. అనం తరం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, పీలేరు టీడీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు కృష్ణారెడ్డి, పీవీ నారాయణ, పులి సత్యారెడ్డి, రాజేంద్రాచారి, చంద్రమౌళి, రమేష్, శేషాద్రిరెడ్డి, బొక్కసం రామకృష్ణ, మురళి, కువైట్ సయ్యద్‌బాషా, చాను, డిష్ బ్రదర్స్, బాబు, సాదిక్, సైదు, గాంధీపేటరెడ్డి, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# రూ.87 వేలు రికవరీ, 49వేలు జరిమానా..

● తంబళ్లపల్లెలో సామాజిక తనిఖీ ప్రజావేదిక



సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహిస్తున్న అధికారులు

తంబళ్లపల్లె, ఆగస్టు 21: ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.86,987లు దుర్వినియోగం కాగా, సిబ్బందికి రూ.49 వేలు జరిమానా విధిస్తూ అధికారులు ఆదేశించారు. మంగళవారం స్థానిక వెలుగు, ఉపాధి హామీ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ అనసూయమ్మ అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఉదయం కొంచెం ఆలస్యంగా ప్రారంభమైన బహిరంగసభ సుమారు రాత్రి 8 గంటల వరకు కొనసాగింది. మండలంలోని 21 పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు రూ.10.38 కోట్లతో వివిధ శాఖల ఆధ్వర్యంలో 1445 అభివృద్ధి పనులు చేశారు. ఇందుకు సంబంధించి గత నెల 18 నుంచి విలేజ్ సోషల్ ఆడిటర్ల బృందం తనిఖీ నిర్వహించి, వివరాలను బహిరంగసభలో వెల్లడించారు. ఎర్రసానిపల్లె, రెడ్డికోట పంచాయతీల్లో నీరు లేక మొక్కలు ఎండిపోవడం, మస్టర్‌లో తప్పిదాలు, హౌసింగ్‌లో బిల్లుల చెల్లింపులు సరిగ్గా లేకపోవడం, లెక్కల్లో తప్పిదాలు వంటి కారణాలతో రూ.86,987 లు రికవరీకి ఆదేశించగా, రూ.49వేలు జరిమానా విధించారు. పనులు చేసిన ప్రాంతాల్లో పనుల వివరాలను తెలిపే సమాచార బోర్డులు ఏర్పాటు చేయాలని, జాబ్ కార్డులు ఉన్న ప్రతి ఒక్కరికీ పూర్తి స్థాయిలో పనులు కల్పించాలని డ్వామా పీడీ మద్దిలేటి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, ఏపీడీ రవికుమార్, మధుబాబు, డీపీఎం ధర్మరాజు, వైస్ ఎంపీపీ కరీం, టీడీపీ మండలాధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, సిద్దమ్మ, బీసీ నాయ కుడు తులసీధర్ నాయుడు, ప్రజా ప్రతినిధులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శు లు, సచివాలయ సిబ్బంది, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### రేపు గ్రామసభలు

మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉపాధి గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఏపీవో అంజినప్ప తెలిపారు.

**రామసముద్రం:** ఈనెల 23న అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఏపీవో గౌరీశంకర్ తెలిపారు. ఇందుకు సంబంధించి మూడు రోజులు ముందుగా గ్రామ కార్యదర్శులు దండోరా వేయించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో గతంలో చేసిన అభివృద్ధి పనులను, ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి పనులు చదివి వినించాలన్నారు. ఇక ముందు చేపట్టబోయే పనులను గ్రామ సభ మినిట్స్ బుక్‌లో నమోదు చేయాలన్నారు.

**పెద్దతిప్పసముద్రం :** ఉపాధి గ్రామ సభలను విజయవంతం చేయాలని ఎంపీడీవో కెఎన్. బాలాజీ, మండల విస్తరణ అధికారి యోగానంద్, ఏపీవో తిరుపాలప్ప పిలుపునిచ్చారు. గ్రామసభల పర్యవేక్షణ కోసం మండల స్థాయి అధికారులు నియమితులయ్యారన్నారు. గ్రామ స్థాయి నాయకులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు తప్పకుండా హాజరు కావాలన్నారు.

# త్వరలో సహకార సంఘాల కంప్యూటరైజేషన్

● డీసీవో గురుప్రకాష్



సహకార సంఘంలో మాట్లాడుతున్న డీసీవో గురుప్రకాష్

నిమ్మనపల్లి, ఆగస్టు 21: అన్నమయ్య జిల్లాలోని 41సహకార సంఘాలను కంప్యూటరైజ్ చేయనున్నట్లు అన్నమయ్య జిల్లా కో-ఆపరేటివ్ అధికారి గురుప్రకాష్ తెలిపారు. బుధవారం మండలంలోని సహకార సంఘాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టు కింద జిల్లాలోని నిమ్మనపల్లి, తిమ్మసముద్రం మండలాలను ఎంపిక చేశామన్నారు. మిగిలిన 39 సహకార సంఘాలను కూడా అక్టోబరు-2లోగా పూర్తి స్థాయిలో కంప్యూటరైజ్ చేయనున్నట్లు తెలిపారు. దీంతో దేశంలో ఎక్కడి నుంచైనా సహకార సంఘాలలో వారి ఖాతాకు సంబంధించిన వివరాలు తెలుకోవచ్చన్నారు. జన ఔషధి కేంద్రాలలో తక్కువ ధరకే మందులు విక్రయిస్తున్నామని, దీంతో పాటుగా సీఈసీ కంప్యూటర్ సెంటర్ ఏర్పాటు చేసి తక్కువ ధరలకే అన్ని సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నిమ్మనపల్లితో పాటు తిమ్మసముద్రం సహకార సంఘాలు కంప్యూటరైజ్ అయ్యాయని అనుమతులు వచ్చిన వెంటనే వీటిని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్సన్ ఇన్‌చార్జి రఘునాథరెడ్డి, ఎస్ఐ మొహిద్దీన్, డీఆర్‌వో ప్రవీణ్ ప్రకాష్, సిబ్బంది వేణుగోపాల్, ధనంజయులు తదితరులు పాల్గొన్నారు.

# 'కర్ణాటక మద్యం'పై గట్టి నిఘా అవసరం : ఎస్ఈబీ డీసీ



ములకలచెరువు: రికార్డులు పరిశీలిస్తున్న ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్

ములకలచెరువు, ఆగస్టు 21: కర్ణాటక మద్యం అక్రమ రవాణాపై నిఘా పటిష్టం చేయాలని అనంతపురం జోన్ ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ విజయ్‌శేఖర్ ఆదేశించారు. ములకలచెరువు ఎస్ఈబీ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటుసారా తయారీ, అమ్మకాలను అరికట్టాలన్నారు సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. పట్టుబడ్డ మద్యం, వాహనాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎస్ఈబీ సీఐ రామ్మోహన్, ఎస్ఐ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

**మదనపల్లె టౌన్:** రికార్డులు, రికవరీ సొత్తు జాగ్రత్తగా ఉంచాలని ఎస్ఈబీ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ ఆదేశించారు. బుధవారం స్థానిక ఎస్ఈబీ స్టేషన్‌ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఈబీ, ఎక్సైజ్ విభాగాలు ఒక్కటి చేసే అవకాశం ఉందని, ఇందులో భాగంగా రికార్డులన్నీ పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న వాహనాలు, కర్ణాటక మద్యం, నాటుసారా తదితర వస్తువుల వివరాలు సక్రమంగా ఉండాలన్నారు. ఇటీవల నమోదైన కేసుల వివరాలు, సీజ్ చేసిన వస్తువుల వివరాలను సరిపోల్చి చూసుకున్నారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, సమాచారం అందిన వెంటనే తనిఖీలు నిర్వహించి ఎన్‌డీపీఎల్, నాటుసారా అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టాలని సూచించారు. సిబ్బంది పనితీరు మెరుగుపరచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డుపై పోలీసుల దాడులు

● మద్యం బాటిళ్లు స్వాధీనం...నిందితుడు అరెస్టు

● టమోటా మండీ యజమానులు, వ్యాపారులకు నోటీసులు




స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లను చూపుతున్న ఎస్ఐ గాయత్రి, టమోటా మండీ యజమానులకు జారీ చేసిన నోటీసు

ములకలచెరువు, ఆగస్టు 21: ములకలచెరువు మార్కెట్ యార్డుపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. అలాగే టమోటా మండీ యజమానులు, వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. బుధవారం ఆంధ్రజ్యోతిలో 'అమ్మో... మార్కెట్ యార్డా'...అసాంఘిక కార్యకలాపాలకు నిలయం అన్న కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై మార్కెట్ కమిటీ అధికారులు, పోలీసులు స్పందించి దాడులు నిర్వహించి నోటీసులు జారీ చేశారు. మార్కెట్ యార్డులో గంజాయి, మద్యం విక్రయించడం, తాగడం, జూదం ఆడటం, మహిళా కూలీలను వేధించడం లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మార్కెట్ కమిటీ కార్యదర్శి జగదీష్ టమోటా మండీల యజమానులు, వ్యాపారస్థులకు నోటీసులు జారీ చేశారు. టమోటా సీజన్ ప్రారంభమైనందున టమోటా మండీల యజమానులు ఆయా ప్రాంగణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి మార్కెట్ కమిటీ కార్యాలయంలో గానీ పోలీసులకు సమాచారం అందించాలని నోటీసులో పేర్కొన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత మండీ యజమానులు బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అసాంఘిక చర్యలకు పాల్పడే వ్యక్తులను పనిలో పెట్టుకున్న మండీ యజమానుల లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. పోలీసులు దాడులు నిర్వహించి తిరుమల టమోటా మండీ ముందు మద్యం విక్రయిస్తున్న నారాయణ (60)ని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి 36 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. కాగా మార్కెట్‌యార్డుపై పోలీసులు నిఘా ఉంచారు. రాత్రివేళల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించే పనిలో పడ్డారు.

# ప్రణాళికలే గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలకం

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 21 : ప్రణాళికలు గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలకమని ఎంపీడీవో బాలాజీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులుగా జరిగిన శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశంలో ఆయనతోపాటు మండల విస్తరణ అధికారి యోగానంద్, కురబలకోట పంచాయతీ విస్తరణ అధికారి అబ్దుల్ షకూర్ పాల్గొన్నారు. ఎంపీడీవో, విస్తరణ అధికారి యోగానంద్ పలు విషయాలను సర్పంచ్‌లు, కార్యదర్శులకు వివరించారు.

**కలికిరి:** మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమాలు ముగిశాయని ఎంపీడీవో గంగయ్య తెలిపారు.

**పెద్దమండ్యం:** గ్రామాల అభివృద్ధి సాధించడానికి కృషి చేయాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌రావు, సర్పంచుల శిక్షణ తరగతుల ట్రైనర్లు మారప్ప, గిరిధర్‌నాయక్ పిలుపు నిచ్చారు.. పెద్దమండ్యం ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఆర్థిక సంఘం నిధుల వివరాలు, ఎంబుక్ తయారీ, ఆడిట్ అంశాలపై సర్పంచులుకు, గ్రామ కార్యదర్శులకు అవగాహన కల్పించారు. ఏపీవో మురళి, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు జగన్, జనార్దన, శైలజ, ఖాదర్‌బాషా, హేమంత్‌రెడ్డి, బాలాజీ, అయిషా, జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**ములకలచెరువు:** గ్రామ పంచాయతీల్లోని సమస్యలపై తక్షణం స్పందించాలని ఎంపీడీవో పోలప్ప సూచించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు ఏపీఎస్ఐఆర్‌డీపీఆర్ అధ్వర్యంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ మోహన్‌ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణానికి హాని కలిగిస్తే చర్యలు : డీఆర్‌వో



మాట్లాడుతున్న డీఆర్‌వో సత్యనారాయణ

మదనపల్లె టౌన్, ఆగస్టు 21: పర్యావరణానికి హాని కలిగిస్తే చర్యలు తప్పవని జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ హెచ్చరించారు. బుధవారం మండలంలోని కోటూరుపల్లె పంచాయతీ ఉడుంవారిపల్లె వద్ద గ్రానైట్ క్వారీయింగ్‌పై స్థానిక ప్రజలతో పర్యావరణ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వారీతోపాటు , సమీపంలోని రహదారుల్లో దుమ్ము, ధూళి లేవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దారికి ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. పెద్దఎత్తున శబ్దాలు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీ చుట్టుపక్కల పొలాలు, చెరువులు కాలుష్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మైనింగ్‌పై ప్రజల నుంచి ఏవైనా అభ్యంతరాలు వస్తే మైన్ యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆరు నెలలకు ఒకసారి శబ్ద, వాయు, నీరు, మట్టి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపాలన్నారు. ఉచిత వైద్య శిబిరాలు, గ్రామాలకు తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడప పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ ఖాజామా, క్వారా యజమాని గోపీనాథరెడ్డి పాల్గొన్నారు.

## ఇసుక మాఫియాకు అధికారుల అండ : సీపీఎం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 21: అధికారుల అండదండలతోనే ఇసుక మాఫియా హల్‌చల్ చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఇసుక అక్రమ నిల్వలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ అక్రమ నిల్వలను చూపినా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బసినికొండ సమీపంలో రెండు చోట్ల, ఎస్బీఐ కాలనీలో ఒక చోట ఇసుక నిల్వలు ఉన్నట్లు మదనపల్లె తహసీల్దారు ఖాజాబీకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా, తనకు సంబంధంలేదు, సెబ్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారని ఆరోపించారు. సెబ్ అధికారులు ఫోన్లు ఎత్తడం లేదన్నారు. మదనపల్లె రెండోపట్టణ పోలీసులు స్పందించినా ఇసుక డంప్‌లతో తమకు సంబంధం లేదని, వాహనాల్లో లోడు ఉంటేనే సీజ్ చేస్తామని తెలిపారు. ఈ అంశాలపై మదనపల్లె సబ్ కలెక్టర్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో, తప్పదన్నట్లు బార్లపల్లె ఇసుక డంపింగ్‌ను తహసీల్దార్ పరిశీలించారన్నారు. మైనింగ్ మాఫియాను కాపాడడమే లక్ష్యంగా తహసీల్దార్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మైనింగ్ మాఫియాను అరికట్టడానికి సీపీఎం ముందు ఉంటుందని, ప్రజలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హరిశర్మ, చిన్నికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా పరిశీలన పక్కాగా నిర్వహించాలి

తంబళ్లపల్లె, ఆగస్టు 21: ఇంటింటి సర్వే చేసి ఓటరు జాబితా పరిశీలనను పక్కాగా నిర్వహించాలని ఈడీటీ మౌలాలి బీఎల్వోలకు సూచించారు. బుధవారం ఆయన ఓటరు నమోదుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల సంఖ్య, చిరునామా, నూతన ఓటర్ల వివరాలను నమోదు చేయాలని సూచించారు. మార్పులు, చేర్పులు, డబుల్ ఎంట్రీలు, డెత్‌లు తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. 18 ఏళ్ల పూర్తి చేసుకున్న యువతీయవకులకు ఓటు హక్కు కల్పించాల్సిన బాధ్యత బూత్‌స్థాయి అధికారులదే అన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ ఇషాక్, బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

## గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు

నిమ్మనపల్లి, ఆగస్టు 21: మండలంలోని పాడి పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు పశు వైద్యాధికారి సురేష్ తెలిపారు. బుధవారం రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్లావాండ్లపల్లిలో టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు నాలుక మీద, గిట్టల మీద పుండ్ల రూపంలో గాలికుంటు వ్యాధి వస్తుందని దీంతో పశువులు నడవలేకపోతాయని, సక్రమంగా మేత కూడా తినవని తెలిపారు. పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుందని తెలిపారు. మండలంలోని పాడి రైతులు కచ్చితంగా గాలికుంటు టీకాను వేయించాలని తెలిపారు.

## మండల అభివృద్ధికి సహకరించాలి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలసిన నాయకులు

నిమ్మనపల్లి, ఆగస్టు 21: మండలాభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కోరినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. బుధవారం మంత్రిని ఆయన నివాసంలో కలిసి పలు విషయాలు వివరించామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో తాము ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నామని, ఇప్పుడు. నియోజకవర్గంలో కొందరికి మాత్రమే ప్రాధాన్యమిస్తూ మిగిలిన కార్యకర్తలను పట్టించుకోవడంలేదని మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.. కార్యకర్తలకు అండగా ఉంటానని, ఎలాంటి పని కావాలన్నా తన వద్దకు రావాలని మంత్రి చెప్పినట్లు వివరించారు. నామినేటెడ్ పోస్టుల భర్తీలో నిమ్మనపల్లికి పాధాన్యమిస్తామని తెలిపారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ అధికార ప్రతినిధి లక్ష్మన్న, మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల యువత అధ్యక్షుడు చినబాబు టీడీపీ సీనియర్‌నేత విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జీ15 బొప్పాయి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కలికిరి, ఆగస్టు 21: జీ15 రకం బొప్పాయి విత్తనాలు అమ్మినా, నర్సరీల్లో మొక్కల పెంచినా కఠిన చర్యలు తీసుకుంటామని ఉద్యాన శాఖ అధికారి సుకుమార్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఆయన మండలంలోని 23 నర్సరీలను సందర్శించి నర్సరీల నిర్వహణకు సంబంధించి చట్టపరమైన అంశాలను యజమానులకు వివరించారు. 21 నర్సరీలకు లైసెన్సులున్నాయని, లైసెన్సులు లేని రెండు నర్సరీల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు చెప్పారు. జీ15 బొప్పాయి రకంపై రైతులు కూడా అవగాహన కలిగి వుండాలని, ఏ పరిస్థితుల్లోనూ ఆ రకం బొప్పాయిని సాగు చేయవద్దని సుకుమార్ రెడ్డి సూచించారు. నర్సరీల్లో స్టాకు రిజిస్టరు, బిల్లు పుస్తకాలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. మొక్కలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకూ బిల్లు ఇవ్వాలని, రైతులు కూడా ముందు జాగ్రత్తగా బిల్లులను భద్రపరుచుకోవాలన్నారు. మదనపల్లె డివిజన్‌లోని పలు మండలాల్లో దాదాపు వంద మంది కౌలు రైతులు జీ15 బొప్పాయి రకం సాగు చేసి తీవ్రంగా నష్టపోయి ఉద్యాన శాఖ కమిషనరును కూడా ఆశ్రయించిన విషయం తెలిసిందే.

## పురాణం త్యాగమూర్తిశర్మ విగ్రహం ప్రతిష్ఠించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 21: పట్టణంలో రచయిత పురాణం త్యాగమూర్తి శర్మ విగ్రహం ప్రతిష్ఠించాలని, ప్రతి ఏటా ఆయన పేరుతో ఓ పండితుడిని సత్కరించాలని ప్రజా చైతన్య స్రవంతి అధ్యక్షుడు గొల్లపూడి తిరుపతిరావు సూచించారు. బుధవారం స్థానిక జ్ఞానోదయ పాఠశాలలో త్యాగమూర్తి శర్మ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు విశ్రాంత డైరెక్టర్ వై. శ్రీనివాసులురెడ్డి , మురళీధర్‌రావు విగ్రహం ఏర్పాటుకు రూ. పది వేలు విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీఈవో నరసింహులు, జోలపాళెం భవానీ ప్రసాద్, సంపత్‌కుమార్, కృష్ణమూర్తి, రామకృష్ణ నారాయణ, విశ్వనాథం, రామ్మోహన్‌రెడ్డి, ప్రభాకర్, మునిగోపాల్‌కృష్ణ నాగభూషణం రావు, తదితరులు పాల్గొన్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ

మదనపల్లె అర్బన్, ఆగస్టు 21: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు, అరాచకాలకు నిరసనగా బుధవారం సాయంత్రం విశ్వహిందూ పరిసత్, ఆర్ఎస్ఎస్, వాల్మీకి సంఘాల నేతలు, వివిధ హిందూ సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలో శాంతీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక సొసైటీ కాలనీలోని రామాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బెంగళూరు రోడ్డు, మల్లికార్జున సర్కిల్, బెంగళూరు బస్టాండ్, టౌన్‌బ్యాంకు సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ వరకు సాగింది.

## పీలేరుకు చేరుకున్న టీడీపీ నేత పాదయాత్ర



వెంకట శివారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు

పీలేరు, ఆగస్టు 21: రాయచోటి నియోజకవర్గం గాలివీడు మండల తెలుగు యువత నాయకుడు కసిరెడ్డి వెంకట శివారెడ్డి చేపట్టిన తిరుమల పాదయాత్ర బుధవారం మధ్యాహ్నం పీలేరుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ రాయచోటిలో మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి, రాష్ట్రంలో టీడీపీ గెలవాలని వేంకటేశ్వరుడికి మొక్కుకున్నానని తెలిపారు. టీడీపీ గెలవడమే కాకుండా రాం ప్రసాద్ రెడ్డికి మంత్రి పదవి కూడా దక్కడంతో సుమారు 100 మంది మొక్కు తీర్చుకునేందుకు పాదయాత్ర ప్రారంభించామన్నారు. పీలేరుకు చేరుకున్న ఆయనకు స్థానిక టీడీపీ నేతలు ఘనంగా స్వాగతం పలికారు. టీడీపీ నాయకులు ఆంజి, రఫీ, రహంతుల్లా, ప్రసాద్, ఆనంద రెడ్డి, ఆర్ఆర్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

## 29న పెద్దమండ్యం మండల సమావేశం

పెద్దమండ్యం, ఆగస్టు 21: ఈ నెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీధర్‌రావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఉంటుందని, మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పకుండా హాజరుకావాలన్నారు.